thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 84 | జగిత్యాల | శనివారం | 20జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

కెనడా-ఖతార్ మ్యాచ్ లో తీవ్ర ఉద్రిక్తత



11

# తెలంగాణలో ధాన్యం నిల్వకు అత్యాధునిక సైలోలు..

23 జిల్లాల్లో 82 ఆధునిక సైలో టెర్మినల్స్ ఏర్పాటు

47.5 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం లక్ష్యం

రూ.4,450 కోట్లతో భారీ ప్రాజెక్టుకు ప్రణాళిక



**హైదరాబాద్, జూన్ 19:** రాష్ట్రంలో ధాన్య కొనుగోలు, నిల్వ వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. రైతులు పండించిన ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక సైలో టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో మొత్తం 82 సైలో టెర్మినల్స్ నిర్మించేందుకు

మిగతా 2వ పేజీలో..




## తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది

- 60 ఏళ్ల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం
- విద్యాశాఖకు రూ.26,600 కోట్ల కేటాయింపు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ
- ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- 119 యంగ్ ఇండియా పాఠశాలలతో విద్యలో విప్లవం

**హైదరాబాద్, జూన్ 19:** తెలంగాణ రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రంగా గానీ, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడలేదని, 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను వికాసం దిశగా తీసుకెళ్తున్నామని

మిగతా 2వ పేజీలో..

కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు 2

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనుమతులిస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ

రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత

సీఎం రేవంత్ రెడ్డి హర్షం

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

3



## మన వనరులే మన పెట్టుబడి

- సంపద సృష్టి దిశగా అడుగులు
- పొరుగు రాష్ట్రాలకు ఇసుక ఎగుమతిపై అధ్యయనం
- పీపీపీ మోడల్ పర్యాటక ఆస్తుల అభివృద్ధి
- టెంపుల్, ఎకో, హెల్త్ టూరిజంపై దూకుడు
- వీకెండ్స్ లో హెలికాప్టర్ పర్యటకానికి ప్రణాళికలు
- పర్యాటకం, రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3





## భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక, విశ్వాస ఘాతుక ప్రభుత్వం

రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ

రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి

మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు

2



## హామీలను విస్మరించిన కాంగ్రెస్



- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

2



## చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- చాంద్రాయణగుట్టలో అంగన్‌వాడీ-కమ్-పాలన కేంద్రం ప్రారంభం

2



## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

3

- స్కూల్ పిల్ల భద్రత యాజమాన్యాలదే బాధ్యత
- యాజమాన్యాలతో భేటీఓ సీపీ సజ్జన్నార్



3

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

- సోమవారం వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం

## ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

- పెళ్లి పేరుతో రూ.12 లక్షలు, బంగారం కాజేసిన యువకుడు
- ఐపీఎస్, ఎంబీబీఎస్ విద్యార్థినంటూ నమ్మించిన కేటుగాడు

3



2



## మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

2

- ప్రతివాదుల జాబితాలో ఏడుగురు
- త్వరలో విచారణ చేపట్టనున్న న్యాయస్థానం



## సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

- కేటీఆర్‌కు టీఎస్ ఈఏప ప్రతినిధుల విజ్ఞప్తి

3

# కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు



- 27 లక్షల మంది విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ
- రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 19 :**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం ఒక చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన వస్తువులతో కూడిన విద్యా కిట్లను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇది కేవలం ఒక రోజువారీ ప్రభుత్వ కార్యక్రమం కాదని, దశాబ్దాలుగా ఉన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు, విద్యార్థుల ఆత్మగౌరవానికి ప్రతీక అని డిప్యూటీ సీఎం అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా కిట్లను ప్రజాప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈ కిట్ లో అందించే బూట్లు, యూనిఫామ్, పుస్తకాలు, బెడ్ షీట్స్ వంటి ప్రతీ వస్తువును అత్యంత నాణ్యతతో రూపొందించినట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాల మాదిరగా మొక్కుబడిగా కాకుండా ప్రజాధనంలోని ప్రతి పైసాకు జవాబుదారీతనంగా ఈ వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఒక తండ్రిలా బాధ్యత తీసుకొని ఈ కిట్లను అందిస్తున్నారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ కేవలం ఒక వస్త్రం ముక్క కాదు.. తాము ఇస్తున్న బూట్లు కేవలం కాళ్లకు వేసుకునేవి కావు.. అవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమాజంలో మేమెవరికీ తక్కువ కాదని ధైర్యంగా, సగర్వంగా తల ఎత్తుకుని తిరిగేలా చేసే ఆత్మగౌరవ ప్రతీకలుగా ఆయన అభివర్ణించారు.

**ప్రపంచంతో పోటీ పడేలా యంగ్ ఇండియా స్కూల్స్**

విద్యా బుద్ధులతోపాటు విద్యార్థుల ఆహార్యం, మౌలిక వసతులు కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ఇందులో భాగంగానే ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ.200 కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ □థయి వసతులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒకేసారి వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేసిందని భట్టి చెప్పారు. ఇటీవలే ఆరుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ దీనికి సజీవ సాక్ష్యం. అక్కడ నిర్మించిన అత్యాధునిక కిచెన్ ఏ కార్పొరేట్ స్కూల్లోనూ లేని విధంగా ఉందన్నారు. భవిష్యత్తులో ని ప్రభుత్వ పాఠశాలలన్నీ ఇదే రీతిన మారబోతున్నాయని చెప్పారు.

**విపక్షాలపై ఘాటు విమర్శలు**

రాష్ట్రంలో పేద, బలహీనవర్గాల పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంస్కరణలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి, ప్రపంచంతో పోటీపడుతున్న విద్యార్థులను చూసి అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు.

**నిరంతరాయంగా విద్యా యజ్ఞం**

ఈ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం ఇందిరమ్మ ప్రభుత్వానికి అత్యంత ప్రియమైనదని, ఇది నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, తెలంగాణ సమాజానికి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణలో ధాన్యం నిల్వకు అత్యాధునిక సైలోలు..

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.
ఈ ప్రాజెక్టు ద్వారా 47.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని దీర్ఘకాలం నాణ్యత దెబ్బతినకుండా భద్రపరచేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది.
ప్రస్తుతం అమలులో ఉన్న సంప్రదాయ నిల్వ విధానాల్లో వర్షాలు, తేమ, పురుగులు, ఇతర ప్రకృతి ప్రభావాల వల్ల ధాన్యం నష్టపోయే అవకాశం ఉంటుంది. అయితే సైలోల ద్వారా ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రక్షించవచ్చని అధికారులు వివరించారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మించే ఈ నిల్వ కేంద్రాలు వాతావరణ ప్రభావాలకు తట్టుకునే విధంగా ఉండటంతో పాటు ధాన్య నాణ్యతను ఎక్కువకాలం కాపాడుతాయి.
రాష్ట్రవ్యాప్తంగా స్వయంచాలక, వాతావరణ నిరోధక ధాన్య నిల్వ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ధాన్యం నిల్వ, రవాణా, పంపిణీ ప్రక్రియలు మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. అవసరమైన సమయంలో నిల్వ ధాన్యాన్ని వేగంగా పంపిణీ చేయడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు కూడా మెరుగుపడనుంది.
సైలోల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సుమారు రూ.4,450 కోట్ల వ్యయంతో ఈ భారీ ప్రాజెక్టును అమలు చేసే అవకాశాలపై అధికారులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు తమ ప్రతిపాదనలు సమర్పించారు. ప్రాజెక్టు అమలు విధానం, నిర్వహణ, పెట్టుబడి నమూనాలపై ప్రభుత్వం పరిశీలన కొనసాగిస్తోంది.
ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖను దేశంలోనే ఆదర్శవంతమైన ఆధునిక ధాన్య నిర్వహణ వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.
ఆధునిక సైలోల ఏర్పాటు ద్వారా ధాన్యం నిల్వలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు నిల్వ సమయంలో జరిగే నష్టాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు వెల్లడించారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరిగి రాష్ట్ర ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ ధాన్య నిల్వ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.



# తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు.
హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించిన ఆయన, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
రాష్ట్ర బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు అంటే రూ.26,600 కోట్లను విద్యాశాఖకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. గత పాలనలో విద్యారంగానికి వందేళ్ల నష్టం జరిగిందని విమర్శించారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను పదేళ్లుగా, ఇతర భత్యాలను పదహారేళ్లుగా పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పెంచినట్లు తెలిపారు. విద్యారంగ ప్రక్షాళన కోసం విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు.
విద్యార్థుల తలరాతను మార్చేది తరగతి గదులేనని పేర్కొన్న సీఎం, తెలంగాణ యువత దేశానికే ఆదర్శంగా నిలవాలంటే విద్యను





ఇష్టపడి అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ విద్యే దేశాభివృద్ధికి బలమైన పునాది కావాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.
దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉన్నప్పటికీ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించలేకపోవడం పాలకుల వైఫల్యమని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు.
కృత్రిమ మేధ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్నాయని, నైపుణ్యాలు ఉన్న వారికి మాత్రం అవకాశాలు విస్తృతంగా ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.
రాష్ట్రవ్యాప్తంగా 119 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ రంగంలో అందించడమే లక్ష్యమని చెప్పారు.
ఇటీవల ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అన్ని సీట్లు నిండిపోయాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పరిమితులు విధించే స్థాయికి విద్యా వ్యవస్థను తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతాధికారులుగా ఎదగాలని, తెలంగాణను దేశంలోనే విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్ 19:**

రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారన్నారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షిణ్యంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ దిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





# మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

**హైదరాబాద్, జూన్ 19:**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు పిటిషన్ దాఖలైంది. నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనను వేధించడంతో పాటు ప్రాణహాని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ శ్రీలత అనే మహిళ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.
గతంలో ఇదే అంశంపై నాంపల్లి కోర్టును ఆశ్రయించిన శ్రీలత పిటిషన్‌ను ఆ కోర్టు విచారించింది. అయితే ఈ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరిగి ఇచ్చేసింది. సంబంధిత అంశాన్ని ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేయాలని సూచించింది.
దీంతో తాజాగా శ్రీలత ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో మీనాక్షి నటరాజన్‌తో పాటు మరో ఏడుగురిని ప్రతివాదులుగా చేర్చారు.కంభం శివకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పార్టీ అధిష్ఠానం స్పందించలేదని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరోపణలపై ప్రజాప్రతినిధుల కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. పిటిషన్‌పై న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

**హైదరాబాద్, జూన్ 19 :**

చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కమ్‌పాలన(డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులకు సమగ్ర సేవలందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతోపాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండేళ్ల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆట వస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, టీనేజ్ బాలికల కోసం ప్రత్యేక మహిళా సంఘాలను



ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలనతోపాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమ్మకు అక్షర మాల కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని మంత్రి సీతక్క చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, ఎస్బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యూష్ మెహ్రోత్రా అధ్యక్షుడు, ఎస్‌బీఐ ఫౌండేషన్ రాజారాం చవాన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ఎస్‌బీఐ ఫౌండేషన్ రుద్రాణి గుహ, అసిస్టెంట్ మేనేజర్ (శిశు అభివృద్ధి) పాల్గొన్నారు.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

**సిద్దిపేట, జూన్ 19:**

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని..కానీ మీది విశ్వాసం లేని కేబినెట్, విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను సీఎం బొందపెట్టారని విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా అని నిలదీశారు. దళారుల దయాదాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని, మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడతారని, మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు బంధు ఇస్తామన్నారని, 90 రోజులు అయ్యిందని, ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 202425 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో హరీష్ రావు వివరించారు. ఎందుకు బీమా రావడం లేదంటే ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీష్ రావు డిమాండ్ చేశారు.

# మన వనరులే మన పెట్టుబడి

హైదరాబాద్, జూన్ 19:

ప్రభుత్వానికి ఆదాయ వనరులు తీసుకువచ్చే రంగాలపై పూర్తిగా దృష్టి పెట్టాలని ఉప ము ఖ్య మంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మన వనరులే మన పెట్టుబడి అని ఆయన అన్నా రు. ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉప సంఘం సచివాలయంలో శుక్రవారం సమావేశమైంది. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక కేంద్రాల్లోని ప్రభుత్వ భూములు, స్థలాలను సమర్థవంతంగా వినియోగించి ఖజానాకు ఆదాయాన్ని తీసుకురావాలని సూచించారు. గోవా, కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయని చెప్పారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజలకు ఉపాధిని కల్పించడమేకాక జీడీపీ పెరుగుదలకు టూరిజం ఉపయోగపడుతోందని చెప్పారు. మన రాష్ట్రంలోనూ టూరిజాన్ని అలగే అభివృ ద్ధి చేయాలని అధికారులకు సూచించారు.టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం రంగాల్లో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. వారాంతాల్లో హెలీకాప్టర్ టూరిజాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శ్రీ శైలం, నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ లో ప ర్యటకాన్ని అభివృద్ధి చేసే ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో టూరిజం ఆస్తు లు పూర్తి స్థాయిలో వినియోగంలో లేవన్నా రు. వాటిని పీపీపీ మోడల్లో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలని సంబంధిత అధికారు లకు ఆయన సూచనలు చేశారు. ఆదాయ సమీకరణలో పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యా ల సాధనలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏకో టూరిజం, హెల్త్ టూరిజం, టెంపుల్ టూరిజంలో అవకాశాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పీపీపీ ఆధారిత సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కేబినెట్ ముందుంచాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన విధానపరమైన అంశాలను కేబినెట్ ముందుంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష చేసింది. చట్టపరమైన నిబంధనలు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ అభిప్రాయపడింది.

**లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ పై సమీక్ష**

లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులపై కేబినెట్ పబ్ కమిటీ సమీక్ష చేసింది. చరంగా నిబంధనలు పాటించే క్రషర్ల నిర్వాహకులకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. నది ఇసుకతో పోలిస్తే రోబో శాండ్ తక్కువ ధరకు లభిస్తోందని సబ్ కమిటీ గుర్తించింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్లాబ్ అధారిత భూముల విలువ సవరణ వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. రవాణా శాఖకు సంబంధించి ఆదాయం, వసూళ్లు పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ కమిటీ సకమీక్ష చేసింది. అందులో భాగంగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ల విషయంలో పన్నులపై రాష్ట్ర అధికారాన్ని సమర్థిస్తూ కేరళకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చినట్లు సబ్ కమిటీ గుర్తించింది. భారత్ సిరీస్ రిజిస్ట్రేషన్లపై చట్టపరమైన, విధానపరంగా తీసుకోవల్సిన అంశాలపై సబ్ కమిటీ చర్చించింది. బీహెచ్ సిరీస్ పన్నుల అంశంపై చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల రవాణా మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి పారిశ్రామిక భూముల క్రమబద్ధీ కరణ కార్యక్రమాల ద్వారా ఆదాయ సమీకరణను సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ఎండీ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్ పోర్ట్ కమిషన్ ఇళాంభర్తి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ పాల్గొన్నారు.

## నాలెడ్జ్ సిటీ భూముల వివాదం..

- **ఎస్‌బీఐపై ప్రభుత్వం ఆగ్రహం**
- **హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన బ్యాంకు***

హైదరాబాద్, జూన్ 19:

రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూముల వేలం వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ భూమిపై తమకూ హక్కు ఉందంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2010లో రూ.13.33 కోట్లకు ఈ భూమిని కొనుగోలు చేశామని, ఇటీవల ప్రభుత్వం వేలం వేసిన భూమిలో కొంతభాగం తమ పరిధిలోనిదేనని పేర్కొంటూ ఎస్‌బీఐ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నాలెడ్జ్ సిటీ భూముల వేలం వివాదాస్పదంగా మారింది.గత మే 28న సర్వే నంబర్ 83/1లోని ప్రభుత్వ భూములను తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ వేలం వేయగా, గౌరా వెంచర్స్ ఎకరానికి రూ.237 కోట్ల చొప్పున అత్యధిక ధరకు భూమిని సొంతం చేసుకుంది. ఈ వేలం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.అయితే వేలం పూర్తయిన తర్వాత భూమిపై హక్కులు ఉన్నాయని ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించడం ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో భూముల వేలానికి సంబంధించిన నిబంధనలను ఎస్‌బీఐనే ఉల్లంఘించిందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ వివాదం నేపథ్యంలో ప్రభుత్వానికి, ఎస్‌బీఐకి మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలపై సమీక్ష చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐలో ఉన్న ప్రభుత్వ డిపాజిట్లు, వివిధ శాఖల ఖాతాల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే ప్రభుత్వ ఖాతాలను ఇతర బ్యాంకులకు బదిలీ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. భూముల యాజమాన్యంపై తుది నిర్ణయం హైకోర్టు విచారణ అనంతరం వెలువడనుండగా, ఈ వివాదం ప్రభుత్వంఎస్‌బీఐ మధ్య కొత్త ఉద్రిక్తతలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

హైదరాబాద్, జూన్ 19:

రాష్ట్రంలోని సుమారు పది వేల ప్రభుత్వ పాఠశాలల్లో 2 కిలోవాట్, 3 కిలోవాట్, 5 కిలోవాట్ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు కోసం ఇటీవల విడుదల చేసిన టెండర్‌లో కనీస వార్షిక టర్నోవర్ ₹150 కోట్లు ఉండాలి, అలాగే ఒకే సంవత్సరంలో 25 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేసిన అనుభవం ఉండాలి అనే అర్హత ప్రమాణాలు విధించారు.. ఈ నిబంధనల కారణంగా ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేస్తున్న స్థానిక సోలార్ ఎంఎస్ఎంఈలు దాదాపు పూర్తిగా అనర్హులుగా మారుతున్నారని సోలార్ ఎనర్జీ అసోసియేషన్ (టీఎస్ ఈఏ) ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు వారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం కలిసి తమ సమస్యను విన్నవించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో వార్షిక రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు చాలా సందర్భాల్లో 20 మెగావాట్లను కూడా మించలేదు. అలాంటి పరిస్థితిలో ఈ టెండర్ నిబంధనలు కొద్దిమంది పెద్ద సంస్థలకు, ముఖ్యంగా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీలకు మాత్రమే అనుకూలంగా రూపొందించినట్లు కనిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ పారిశ్రామికవేత్తలు తమ సొంత రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఇంతకుముందు విడుదలైన పాఠశాల సోలార్ టెండర్ కూడా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీలకే కేటాయించబడింది. అయితే సంవత్సరం గడిచినప్పటికీ ఆ ప్రాజెక్టు అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని సమాచారం. స్థానిక పరిశ్రమ సామర్థ్యాలను వినియోగిస్తూ భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉన్న సమయంలో, కొత్త టెండర్ మరింత కఠినమైన అర్హత ప్రమాణాలతో స్థానిక సంస్థలకు అడ్డంకులు సృష్టిస్తోందని వివరించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సానుకూల స్పందన లభించలేదు. అందువల్ల నాణ్యత ప్రమాణాలను కాపాడుతూ తెలంగాణకు చెందిన సోలార్ సంస్థలు కూడా పోటీ పడగలిగే విధంగా టెండర్ అర్హత ప్రమాణాలను హేతుబద్ధంగా సవరించాలని వారు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. నిజానికి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక మన ఊరు – మన బడి కార్యక్రమం అమలులో భాగంగా తెలంగాణకు చెందిన సోలార్ పారిశ్రామికవేత్తలకు పాఠశాలలలో సోలార్ ప్రాజెక్టుల అమలులో సమాన అవకాశాలు కల్పించబడ్డాయని వారు గుర్తుచేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బుర్ర అశోక్ కుమార్ గౌడ్అ, ధ్యక్షుడు తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ (టీఎస్ ఈఏ) ,శ్రీహరిబాబు జనరల్ సెక్రటరీ , బాబు నాయుడుజాయింట్ సెక్రటరీ, శ్రీనివాస్ కుక్కడపు జాయింట్ సెక్రటరీ, రాజేష్ పరకాలవైస్ ప్రెసిడెంట్, ఈసీ మెంబర్లు బదరి నారాయణ, జాన్ విల్యం, రాఠి తదితరులు

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,జూన్ 19:

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుఅమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ, ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరానికి సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి. మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

హైదరాబాద్, జూన్ 19 :

భూ సమస్యలు, భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశలవారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని, ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చరిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలపు సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందని చెప్పారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు. నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

**ప్రతి సర్వే నంబర్‌కు భూదార్**

భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికీ ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం అవి 2.29 కోట్లకు పెరిగాయని, రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి ఆరుగురు సర్వేయర్లను నియమించినట్లు వివరించారు. రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీసర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

హైదరాబాద్,జూన్ 19:

మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్‌స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని, అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్‌స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

హైదరాబాద్, జూన్ 19:

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్‌తో పాటు ఇతర నిందితులు కూడా సోమవారం నాడు వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు సుదీర్ఘ దర్యాప్తు చేపట్టి అల్లు అర్జున్‌ను ఏ11గా పేర్కొంటూ ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు, సంధ్య థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను ప్రధాన నిందితులుగా పేర్కొన్నారు. దాఖలైన ఛార్జ్ షీట్‌ను పరిశీలించిన నాంపల్లి కోర్టు విచారణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూ అల్లు అర్జున్‌తో పాటు మరో 19 మందికి సమన్లు జారీ చేసింది.

ప్రీమియర్ ప్రదర్శన రోజున అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తేందుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నమోదైన ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణ దశకు చేరుకుంది. తాజా సమన్ల నేపథ్యంలో అల్లు అర్జున్ సహా నిందితులు సోమవారం కోర్టుకు హాజరవుతారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

మెదక్, జూన్ 19:

సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు సృష్టించి యువతులను మోసం చేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో వెలుగుచూసింది. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి ఇద్దరు యువతుల నుంచి లక్షల రూపాయలు, బంగారం కాజేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్థానికుల కథనం ప్రకారం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి దుర్గయ్య ఇన్‌స్టాగ్రామ్‌లో తన పేరును రిత్విక్ రెడ్డిగా మార్చుకుని అదే గ్రామానికి చెందిన ఓ యువతికి స్నేహ అభ్యర్థన పంపించాడు. ఆమె అంగీకరించిన తర్వాత తాను ఛత్తీస్‌గఢ్‌లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నానని నమ్మించాడు.

పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ ఖర్చుల కోసం డబ్బులు కావాలని చెప్పి యువతి నుంచి రూ.5 లక్షలతో పాటు తులం బంగారు కమ్మలను తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అంతటితో ఆగకుండా మరో నకిలీ ఖాతా సృష్టించి సాత్విక్ రెడ్డి పేరుతో ఏ క్లాస్ పూర్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు స్నేహ అభ్యర్థన పంపాడు. ఆమెతో పరిచయం పెంచుకుని తాను ఎంబీబీఎస్ చదువుతున్నానని చెప్పి, విద్యా ఖర్చుల పేరుతో విడతల వారీగా రూ.7 లక్షలు తీసుకున్నట్లు సమాచారం.

డబ్బులు తీసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో ఇద్దరు బాధితులు మోసపోయినట్లు గుర్తించారు. అనంతరం టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటన కొంత ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. సామాజిక మాధ్యమాల్లో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



## క్షయ రహిత రాష్ట్రమే లక్ష్యం

- **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్**

హైదరాబాద్, జూన్ 19 :

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను రాష్ట్రంలో 2,492 గ్రామాల్లో హెల్త్ స్క్రీనింగ్‌లు నిర్వహిస్తున్నామని, క్షయ వ్యాధి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. దేశంలో క్షయ, మాతా□శిశు సంరక్షణ, నివారణ కార్యక్రమాలపై ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. క్షయ నిర్ధారణ పరీక్షలు (ఎక్స్‌రే, తెమడ పరీక్షలు) అనుమానితులందరికీ నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సతోపాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి నెలా రూ.వెయ్యి నిక్షయ పోషణ యోజన కింద అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తెలిపారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం ఫుడ్ బాస్కెట్‌లను బాధితులకు అందిస్తున్నామని, క్షయ వ్యాధి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి దామోదర్ అన్నారు. రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మాతృ మరణాలను, నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామన్నారు.



# సమగ్ర పంటల విధానమే పరిష్కారం!

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబిరిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ÷ాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# మళ్లీ రగిలిన పశ్చిమాసియా

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

## కాల్పుల విరమణకు ఎదురుదెబ్బ

## శాంతి చర్చలపై అనిశ్చితి



**బీరూట్, జూన్ 19 :** ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. దక్షిణ లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు లెబనాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రాంతీయ పరిస్థితులు మరోసారి ఆందోళనకరంగా మారాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన వెంటనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇరాన్--అమెరికా మధ్య కుదిరిన తాజా అవగాహన ప్రకారం లెబనాన్‌తో పాటు సంబంధిత ప్రాంతాల్లో సైనిక చర్యలు నిలిపివేయాల్సి ఉంది. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపై ఉంటుంది. అయితే తాజా దాడులతో ఆ ఒప్పంద భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మాత్రం హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భద్రతా అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన ఇరాన్--అమెరికా తదుపరి చర్చలు వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలనే చెబుతున్నప్పటికీ, తాజా పరిణామాల ప్రభావమే దీనికి కారణమని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందన్న ఆశలు వ్యక్తమయ్యాయి. అయితే లెబనాన్‌లో కొనసాగుతున్న తాజా దాడులు ఆ ఆశలకు గండికొట్టాయి. పరిస్థితులు మరింత దిగజారితే ప్రాంతీయ స్థిరత్వంతో పాటు శాంతి ప్రయత్నాలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# నీట్ పరీక్షకు అత్యాచార నిందితుడికి బెయిల్

- నాలుగు రోజుల తాత్కాలిక అనుమతి
- పరీక్ష రాసేందుకు కోర్టు అవకాశం
- కఠిన షరతులతో మంజూరు

**ముంబై, జూన్ 19 :** అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న 18 ఏళ్ల యువకుడికి నీట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు ముంబై ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నాలుగు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తూ న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 18 నుంచి 21 వరకు బెయిల్‌పై విడుదల చేసి, జూన్ 22 మధ్యాహ్నం 2 గంటలలోపు తిరిగి జైలులో లొంగిపోవాలని ఆదేశించింది. ప్రస్తుతం నవీ ముంబైలోని తలోజా కేంద్ర కారాగారంలో ఉన్న ఈ యువకుడిపై భారతీయ న్యాయ సంహిత కింద అత్యాచారం కేసుతో పాటు చిన్నారుల రక్షణ చట్టంలోని పలు నిబంధనల కింద అభియోగాలు నమోదయ్యాయి. బెయిల్ అభ్యర్థనపై విచారణ సందర్భంగా బాధితురాలు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయస్థానానికి తెలియజేసింది. అయితే తనను లేదా తన కుటుంబ సభ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించకూడదని షరతు విధించాలని కోరింది. నిందితుడి తరఫు న్యాయవాది వాదిస్తూ, విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం పునరావాస ప్రక్రియలో భాగమని తెలిపారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు యువకుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కొంత సమయం అవసరమని, పోలీసుల భద్రత మధ్య పరీక్ష రాయాల్సి వస్తే మానసికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. మరోవైపు ప్రభుత్వ తరఫు న్యాయవాది ఈ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. అవసరమైతే ఒక్కరోజు మాత్రమే పోలీసుల పర్యవేక్షణలో పరీక్ష రాసేందుకు అనుమతించాలని సూచించారు. అయితే పూర్తి స్థాయి తాత్కాలిక బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.ఆర్. శర్మ, నిందితుడి ఉన్నత పాఠశాల అర్హత పత్రం, నీట్ ప్రవేశ పత్రాన్ని పరిశీలించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బెయిల్ ఇవ్వడానికి తగిన కారణాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అభియోగ పక్షం వ్యక్తం చేసిన ఆందోళనలను కఠినమైన షరతుల ద్వారా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం పలు నిబంధనలు విధించింది. బాధితురాలిని ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించకూడదని, సాక్ష్యాలను ప్రభావితం చేయకూడదని, కేసుకు సంబంధించిన ఎవరినీ ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే నీట్ పరీక్ష రాసినట్లు ధ్రువీకరణ పత్రాలను జైలులో లొంగిపోయే సమయంలో సమర్పించాలని ఆదేశించింది. రూ.50 వేల పూచీకత్తుతో ఈ తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది.







# పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

## వాట్సాప్ ద్వారా సచారం తెలుసుకునే వీలు

## నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం



**న్యూఢిల్లీ, జూన్ 19:** నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎమ్ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

# రాహుల్‌కు ప్రధాని శుభాకాంక్షలు



- జన్మదినం సందర్భంగా సందేశం
- ప్రముఖుల నుంచి అభినందనల వెల్లువ
- ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్ష

**న్యూఢిల్లీ, జూన్ 19 :** పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమ వేదికలో సందేశం విడుదల చేశారు. దేశ ప్రజల సేవలో మరింత కాలం కొనసాగాలని కోరుకున్నారు. నేడు 56వ ఏటలోకి అడుగుపెట్టిన రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పేదలకు ఆహార పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల కోసం సాగిస్తున్న పోరాటం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాహుల్ గాంధీకి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర మరింత విస్తరించాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు కూడా తమ సందేశాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ 1970 జూన్ 19న ఢిల్లీలోని హోలీ ఫ్యామిలీ ఆసుపత్రిలో జన్మించారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ, మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుటుంబ వారసుడిగా రాజకీయాల్లో ప్రవేశించిన ఆయన, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగా ఎదిగారు. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రజా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఆయన జన్మదినం సందర్భంగా దేశ నలుమూలల నుంచి అభినందనలు వెల్లువెత్తుతుండగా, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహణ:

### లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ బిక్షపతి యాదవ్..



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :** ప్రస్తుతం సమాజంలో వైద్యం పేదవారికి అందుబాటులో లేని పరిస్థితుల్లో పేదలకు వైద్య సేవలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆదివారం నిజాంపేట సర్కిల్ లోని బండారి లేఅవుట్ కమ్యూనిటీ హాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయబడింది. ఈ వైద్య శిబిరంలో పల్స్ హాట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన సీనియర్ కన్సల్టెంట్ జెయింట్ రిప్లేస్మెంట్ యాంత్రోస్కోపీ సర్జన్ డాక్టర్ సాయి చంద్ర మల్లాడి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. ఈరోజుల్లో మోకాలు మరియు కీళ్ల సమస్యలు సర్వసాధారణమైందని, అలాంటి వారందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోగలరని శుక్రవారం లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిక్షపతి యాదవ్ తెలిపారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :** భారతదేశ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు రాహుల్ గాంధీ. కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశం కోసం కృషి చేస్తున్న యువనేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, బుయ్యని శివ కుమార్, డీసీసీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ దీర్ఘాయుష్మాన్, మంచి ఆరోగ్యాన్ని కలగాలని కోరుకున్నారు.

## నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల నుంచి మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ వినతులు స్వీకరించారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన వివిధ ప్రాంతాల ప్రజలు ఆయనను కలిసి, తమ సమస్యలను విన్నవించారు. కొన్ని ఆలయాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కోరారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం నియోజకవర్గ ప్రజలను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కలిశారు. స్థానిక సమస్యలపై ఆయన వద్దకు వచ్చిన వారిలో కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, మంచినీటి సరఫరా వంటి వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. ప్రజలు చెప్పిన ప్రతి అంశాన్ని ఆద్యంతం విన్న ఆయన తగు చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పళ్ళు పంపిణీ చేసిన కూన శ్రీనివాస్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :** మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ భవిష్యత్తులో భారత ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేంద్ర గౌడ్, చౌడా శ్రీనివాసరావు, నాగిళ్ల శ్రీనివాస్, దుంపనబోయిన శ్రీనివాస్, యాముసాగర్, జిమ్ వేణు, చందు గౌడ్, సుశాంత్, తౌఫిక్, బిల్లా వెంకట్, చోటు, రఘు, ఉలిపి శ్యామ్, వెంకటేష్ యాదవ్, సంపత్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం

- **ధర్మపురిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..**
- **హాజరైన మంత్రి అడ్లూరి..**




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19, :** దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మపురిలోని నంది చౌరస్తాలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహిం చారని మంత్రి అడ్లూరి అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు. దేశానికి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవి చేపట్టకుండా ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ను ప్రధాని మంత్రి చేశారని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రధానమంత్రి మోడీ పేదలకు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. డిల్లీ శివారులో రైతులు మద్దతు ధర కోసం ధర్నా చేస్తే రైతులపై జీను ఎక్కించిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం అని మంత్రి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ పని చేస్తున్నారని, 2029లో రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిగా చూడాలని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, నాయకులు తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- **జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**





**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19, :** జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి పై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సక్రమంగా, సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ, కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సమానంగా, సమయానికి, సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీఓ మధు సూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సులను తనిఖీ చేసిన గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

- **బస్సు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు**
- **ప్రతి బస్సులో ఎమర్జెన్సీ వైద్య పరికరాల కిట్స్ అందుబాటులో ఉంచాలి**
- **విద్యార్థుల భద్రత దృష్టిలో ఉంచుకోవాలి**



**గజ్వేల్ టౌన్, జూన్ 19, :** సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) ఆదేశాల మేరకు శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని పిడిచేడు రోడ్డుపై పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీ (స్పెషల్ డ్రైవ్) నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలు, సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు సహాయక సిబ్బందికి విద్యార్థుల భద్రతకు సంబంధించిన పలు సూచనలు ఇవ్వడం జరిగిందని, తనిఖీలలో భాగంగా క్రింది అంశాలను పరిశీలించడం జరిగిందన్నారు. బస్సు డ్రైవర్లు పరిశుభ్రమైన యూనిఫాం ధరించి, నేమ్ బ్యాడ్జ్‌తో విధులు నిర్వహించాలని, వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్ సర్టిఫికెట్, పెర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పియుసి) సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, ప్రతి బస్సులో వైద్యానికి సంబంధించిన కిట్స్ అందుబాటులో ఉండాలని, ప్రతి బస్సుకు జిపిఎస్ పరికరం అమర్చాలని, ప్రతి బస్సులో ఒక హెల్పర్ తప్పనిసరిగా ఉండాలని, బస్సు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించకూడదని సూచించడం జరిగిందన్నారు.అలాగే బస్సులో ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా పనిచేస్తుందో లేదో తనిఖీ చేయడం జరిగిందని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించడం జరిగిందని, విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల బస్సులు నిర్దేశించిన అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ యూజీ-2026 పరీక్ష నిర్వహణకు పూర్తయిన అన్ని ఏర్పాట్లు

- **అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 19, :** జిల్లాలో ఈ నెల 21న ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ యూజీ–2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, ఎన్‌టిఏ, జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో,పారదర్శక నీటి బాటిల్ అన్నది ఉంటుందన్నారు.పాటించాల్సిన సూచనలు.. అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం మధ్యాహ్నం 1.30 గంటలుకంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి. పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి. నిషేధిత వస్తువులు, స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు, ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం, బెల్ట్, ఆభరణాలు ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి, ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు. పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని, ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించ బడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ యూజీ–2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

# సీఎం సహాయ నిధి పేదలకు గొప్ప వరం

- **కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :** సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరమని హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సాయిబాబా నగర్ మరియు బాచుపల్లి ప్రాంతాలకు చెందిన అంబుగోల ప్రసాద్ మరియు మేకల రుద్రమదేవి అనే ఇద్దరు వ్యక్తులు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బాధితులకు వైద్య చికిత్స మరియు శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6,00,000/– మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి పత్రాలను కొలన్ హన్మంత్ రెడ్డి బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో ఆశను నింపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చురకలు



# వెలిచాల ప్రజా కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 19, :**



కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం, కార్పొరేటర్లు గుమ్మడి రాజ్‌కుమార్, పడాల శ్రీజ అజయ్, నందిని ఉదయ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గాంధీ కుటుంబం త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. దేశం కోసం మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ యువత, రైతులు, మహిళలు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను పార్లమెంట్ వేదికగా బలంగా వినిపిస్తున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ఐక్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ దేశ ప్రధాని అయ్యే వరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో పనిచేస్తారని, ఆయన నాయకత్వంలో దేశంలో మార్పు సాధ్యమవుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాశెట్టి శ్రీనివాస్, గండి రాజేశ్వర్, సరిల్ల రతన్ రాజు, గండి శ్యామ్, వేల్పుల వెంకటేష్ వెలిచాల రాజేందర్ రావు యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, నాయకులు మిడిదొడ్డి కపిల్ మాధవ్, సముద్రాల రమణారావు, దుర్గు మహేందర్, అనంతుల రమేష్, మీసాల శంకర్, రాచర్ల పద్మ, పత్తెం లక్ష్మీనారాయణ రాజేష్, వెలిచాల ప్రజా కార్యాలయ సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు నందయ్య ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19, :**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం జగిత్యాలలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమ్మిళ్ల వాణి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య మాట్లాడుతూ దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ, సామాన్యుల పక్షాన నిలబడే నాయకత్వం ఆయనదేనని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ గారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి



ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్త మోహన్, బండ శంకర్, దుమాల రాజ్ కుమార్, ముఖేష్ కన్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

# నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను

- ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం..
- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్:
- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన విస్పర్ వ్యాలీ కాలనీ నూతన కమిటీ సభ్యులు..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 19, :**



శుక్రవారం బాచుపల్లి – నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని 274వ వార్డు, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న విస్పర్ వ్యాలీ కాలనీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించి, కాలనీ అభివృద్ధి కోసం తన సంపూర్ణ సహకారం మరియు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల కొరత తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, ఆయా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, 20వ వార్డు బి.ఆర్.ఎస్. పార్టీ మహిళా అధ్యక్షురాలు సంధ్యా రాణి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి నాగమణి, సోషల్ మీడియా అధ్యక్షుడు విద్యాసాగర్, మరియు సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి లీలావతి, సంయుక్త కార్యదర్శి పృథ్వీ కుమార్, కోశాధికారి రామకృష్ణ బండి, సత్యం వ్యాలీ వాసులు చిట్టిబాబు, ప్రసాద్, రామ్ ప్రసాద్, అశోక్, రదీప్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీహరి క్యాంపు కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 19, :**

లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో కులాలు మతాల పేరుతో విడగొడుతున్న తరుణంలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా 4200 కిలోమీటర్లు నడిచి భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా ప్రజల ఐక్యతకు కృషి చేశారన్నారు. మనమేంతో మనకంత అనే నినాదంతో జిత్నే అబాది హే ఉత్నే ఇసెదరి మిల్నా చాహియే అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో కుల గణన చేశామని తెలిపారు. చట్ట సభల్లో ఇంకా అడుగుపెట్టని వెనకబడిన జాతులు ఉన్నాయని, వారి వెనకబాటు తనం పోగొట్టి వారిని అన్నీ రంగాల్లో ఉన్నత స్థాయికి తెచ్చే విధంగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీకి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాలుగా శక్తిని ఇవ్వాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ




మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 19, :**



రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీ, ఎస్‌వీఎస్‌బీ అవతార్ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.శుక్రవారం సాయంత్రం మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎస్‌వీఎస్‌బీ అవతార్ అపార్ట్‌మెంట్ వాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వారి విజ్ఞప్తి మేరకు 24 గంటల్లోగా సొంత నిధులతో నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయడంతో పాటు స్వాగత తోరణం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం శ్రీ సాయి నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం సొసైటీ కార్యాలయ భవనం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతీయ రహదారి నుంచి కాలనీ లోపలికి వెళ్లేందుకు ర్యాంపులు, బెల్‌మౌత్ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే బస్ డిపో రోడ్డుతో పాటు కాలనీల అంతర్గత రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పారు.కాలనీ అభివృద్ధికి రాబోయే రోజుల్లోనూ తమ పూర్తి సహకారం కొనసాగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఈఈ సురేష్, డీఈలు వెంకటరమణ, శివకుమార్, నాగరాజు, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, కుమార్ గౌడ్, రాజు, కాలనీల అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, రవికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 19, :**

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.శుక్రవారం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంఘం తెల్లాపూర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం సంఘానికి త్వరలోనే స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భవన నిర్మాణ కార్మికులకు తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.అసోసియేషన్ తరపున ప్రతి కార్మికుడు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ప్రమాదాల సమయంలో ఇలాంటి బీమా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, శ్రీశైలం, దయాకర్, పాల్ రెడ్డి, నాగరాజు, సాగర్, హర్ష,



ఇంద్రారెడ్డి, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో రూ.3.13 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన



**గుమ్మడిదల, జూన్ 19, :**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో రూ.3 కోట్ల 13 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు అభివృద్ధికి దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ గుమ్మడిదలను అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేసినప్పుడే వారి విశ్వాసం, మన్ననలు పొందగలమన్నారు.ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక పరిశ్రమల సీఎస్‌ఆర్ నిధులను కూడా వినియోగించి మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.అనంతరం గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీ.ఎం సహాయ నిధి సద్వినియోగం లో అశ్వారావుపేట మొదటి స్థానం

## ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, జూన్ 19, :**



అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హైదరాబాద్ తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి విభాగాన్ని శుక్రవారం సందర్శించి అశ్వారావుపేట నియోజకవర్గంలోని అనారోగ్య బాధితుల నుంచి సేకరించిన ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాధితులకు వైద్య ఖర్చుల భారం తగ్గేలా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత గల వారి వైద్య అవసరాలకు అండగా నిలుస్తోందని నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సహాయం అందే వరకు తను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన పలువురు రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా ఆసుపత్రి వైద్యులకు

# నీట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 19, :**



జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)–2026 పరీక్షల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ 163 బీఎన్ఎస్ఎస్–2023 సెక్షన్ కింద శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సిద్దిపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ రోడ్, సిద్దిపేట పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధించారు. ఈ ఆంక్షలు జూన్ 21 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకురావడం నిషేధం. పరీక్షలకు సంబంధించిన నిషేధిత పత్రాలు కలిగి ఉండడాన్ని కూడా అనుమతించరని, పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. అయితే విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు..

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**నంగునూరు, జూన్ 19, :**



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నంగునూరు మండల వ్యవసాయ అధికారి గీత హెచ్చరించారు. రాజగోపాల్ పేట ఎస్సై వివేక్ తో కలిసి శుక్రవారం నంగునూరులోని విత్తన డీలర్ల దుకాణాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గీత, రాజగోపాలపేట ఎస్సై వివేక్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించ వద్దని చెప్పారు. అనుమతి ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాన్నారు. అధిక ధరలకు అమ్మకాలు చేపట్ట వద్దని సూచించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా విత్తనాల కొనుగోలు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సన్న రకం విత్తనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. దుకాణంలో ఉన్న స్టాకు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.

చురకలు

శనివారం 20 జూన్ 2026

# మెరీడియన్ పాఠశాల బస్సులను తనిఖీ చేసిన ట్రాఫిక్ పోలీసులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 19, :** పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మెరీడియన్ పాఠశాల బస్సులను ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ సిహెచ్ ముత్యంరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలు, వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లు, సహాయక సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీలలో భాగంగా డ్రైవర్లు యూనిఫాం, నేమ్ బ్యాడ్జ్ ధరించి విధులు నిర్వహిస్తున్నారా, వాహనాలకు ఫిట్‌నెస్, పర్మిట్, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు. అలాగే ప్రతి బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, జీపీఎస్ పరికరం, సహాయక సిబ్బంది అందుబాటులో ఉన్నారా అని తనిఖీ చేశారు. అదనంగా, బస్సుల్లో సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు సక్రమంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం ప్రభుత్వం నిర్దేశించిన అన్ని భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ పోలీసులు పాఠశాల యాజమాన్యాలను కోరారు.

# మున్సిపల్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలి

- మూడు నెలల పెండింగ్లో ఉన్న ఈఎస్ఐ పిఎఫ్ డబ్బులు తక్షణమే చెల్లించాలి
- మున్సిపల్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రవీణ్ కుమార్



**సదాశివపేట, జూన్ 19,** సదాశివపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులందర్నీ పర్మనెంట్ చేయాలని సదాశివపేట మున్సిపాలిటీలో మూడు నెలల పెండింగ్ లో ఉన్న ఈఎస్ఐ పీఎఫ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈరోజు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతామని అనేక సంవత్సరాలు నుండి పనిచేస్తున్న కార్మికులందరికీ పర్మనెంట్ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది అన్నారు. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఇప్పటివరకు కనీసం మున్సిపల్ కార్మికుల గురించి పల్లెత్ మాట కూడా మాట్లాడడం లేదు అన్నారు. మున్సిపల్ కార్మికుల అంటే రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపు చూస్తుంది అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం కార్మికులకు 26వేల రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 25 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు పర్మనెంట్ చేయడం లేదు తక్షణమే సీనియార్టీ ప్రకారం కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేట మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికుల ప్రతినెల జీతం నుండి ఈఎస్ఐ పిఎఫ్ డబ్బులు కట్ అవుతున్న వారి అకౌంట్లో జమ కావడం లేదు అన్నారు. మున్సిపల్ అధికారులు ఈఎస్ఐ డబ్బులు సకాలంలో కట్టకపోవడం వల్ల కార్మికులకు ప్రమాదాలు గుర్తైతే ఈఎస్ఐ దావఖానలో చూడడం లేదు అన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు పెండింగ్లో ఉన్న ఈఎస్ఐ పిఎఫ్ డబ్బులు కార్మికుల అకౌంట్లో జమ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనియెడల పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళన నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ యూనియన్ నాయకులు సిహెచ్ శ్రీనివాస్, అంజయ్య, చౌదరి,మల్లేష్, మాణిక్యం, రాజు,అనిల్, కృష్ణ, అమృతమ్మ, ప్రమీల,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**తొగుట, జూన్ 19, :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశి మిఠాయిలు పంచుకున్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడని కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ దేశ భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు.దేశ ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రాహుల్ గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు పంది రాజు, మండల ఉపాధ్యక్షులు బెజ్జనమైన అనిల్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు బెజ్జనమైన ప్రవీణ్, మిద్దె సంతోష్, నాయకులు పాత్కుల వెంకటేశం, వడ్డే కిష్టయ్య, మిద్దె స్వామి, జంగపల్లి ఆంజనేయులు, మస్కూరి ఆంజనేయులు, పోతరాజు రవీందర్, స్వామి చరణ్ గౌడ్, టంకరి స్వామి, ఎర్రోళ్ల అర్జున్, కల్లెపు నరేష్, నాగులపల్లి నర్సింలు, నాగులపల్లి అనిల్, వడ్డే నర్సింలు, వడ్డే నాగరాజు, బ్యాగరి శేఖర్, కల్లెపు భాస్కర్, జంగపల్లి స్వామి, కుమార్, కరుణాకర్, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# దమ్మపేటలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై కేటీఆర్ అవినీతి, అక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల పై చేసిన ఆరోపణలను ఖండించిన దమ్మపేట కాంగ్రెస్ శ్రేణులు

**దమ్మపేట, జూన్ 19, :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో రాహుల్ గాంధీ కీలకమైన వ్యక్తి అని, దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్ అన్నారు. శుక్రవారం దమ్మపేట మండల కేంద్రంలోని వై.ఎస్.ఆర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించు కుంటూ కాంగ్రెస్ శ్రేణులు వేడుకలు జరిపారు. రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి, హ్యాపీ బర్త్ డే టూ రాహుల్ గాంధీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, అత్తులూరి వెంకట రామారావు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని, ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టకుండా మన్మోహన్ సింగ్ ని ప్రధాని చేశారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ దేశ ఐక్యత కోసం పనిచేస్తున్నారని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని, ఇందుకు ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై అవినీతి, అక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశాలను ప్రస్తావిస్తూ చేసిన విమర్శలు ఖండించిన దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ, అభివృద్ధి కనపడకపోతే మాట వస్తే చూపిస్తాం అని ఎద్దేవా చేశారు, పంచాయతీకి 10 సం.లలో 20 ఇండ్లు కట్టి, రేషన్ కార్డు ఇవ్వకుండా ప్రభుత్వం నడిపిన వ్యక్తులా మా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రధాత మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని విమర్శించేది. స్వయాన కే.టి.ఆర్ సోదరి కల్వకుంట్ల కవిత 'వీకెండ్ ఎమ్మెల్యే' అన్న మాట గుర్తులేదా కే.టి.ఆర్ కి అన్నారు. ఈ





కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాసరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, గోపి, అప్పారావు, పగడాల కృష్ణారావు, పసుమర్తి పెద్దబాబు, చక్రాల మల్లేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, రాంశెట్టి పుల్లారావు, వనమాల శ్రీనివాసరావు, దేవయ్య, వేముల శ్రీను, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కుప్పాల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, చిలకా శ్రీనివాసరావు, ధర్మసోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో అజ్ఞాత వీరులకు సన్మానం

- ఆనందోత్సాహాల మధ్య ముగిసిన 'ముదిత 4.0' వేడుక



**పటాన్చేరు, జూన్ 19, :** సురక్షితమైన, ఆహ్వానించదగిన, సుసంపన్నమైన క్యాంపస్ వాతావరణాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆతిథ్య విభాగం, క్యాంపస్ లైఫ్, సహాయక సేవల సిబ్బందిని గౌరవిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం వార్షిక ఉద్యోగుల గుర్తింపు, అభినందన కార్యక్రమం ★'ముదిత 4.0'★ను ఘనంగా నిర్వహించింది.ఇతరుల సంతోషం, విజయాలను చూసి ఆనందించడం అనే అర్థం వచ్చే సంస్కృత పదం 'ముదిత' నుంచి ఈ కార్యక్రమానికి పేరు పెట్టారు. కృతజ్ఞత, సేవాభావం, జట్టు కృషి, సామూహిక విజయాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమం, విశ్వవిద్యాలయ అభివృద్ధికి తెరవెనుక కృషి చేస్తున్న ఉద్యోగుల సేవలను గుర్తించే సంప్రదాయంగా గత నాలుగేళ్లుగా కొనసాగుతోంది.ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పారిశుధ్య, వంటలు, నిర్వహణ, సాంకేతిక విభాగం, తోటపని, హాస్టల్, రవాణా, ప్రాజెక్టులు, ఐటీ, ఆడియో–విజువల్, మానవ వనరులు, ఆర్థిక, పరిపాలన తదితర సహాయక విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, బృందాలను వివిధ విభాగాల్లో అవార్డులతో సత్కరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు.ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ మాట్లాడుతూ, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది, సందర్శకులకు నాణ్యమైన సేవలు అందించడంలో తమ బృందాలు ప్రతిరోజూ అంకితభావంతో పనిచేస్తున్నాయని తెలిపారు. యాజమాన్య స్ఫూర్తి, సేవాభావం, కరుణతో వారు విశ్వవిద్యాలయానికి బలమైన పునాదిగా నిలుస్తున్నారని అన్నారు.విశ్వవిద్యాలయం విజయానికి కేవలం విద్యా నైపుణ్యమే కాకుండా, సంస్థ లక్ష్య సాధన కోసం నిస్వార్థంగా పనిచేసే సహాయక సిబ్బంది అంకితభావం కూడా కీలకమని యాజమాన్యం పేర్కొంది. క్యాంపస్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న అజ్ఞాత వీరులకు నివాళిగా 'ముదిత 4.0' నిలిచిందని వెల్లడించింది.అభినందన, సమ్మిళితత్వం, పరస్పర గౌరవం, విశిష్ట సేవా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

- రక్త దానం చేసిన గుంటుకు శ్రీనివాస్



**గజ్వేల్ టౌన్, జూన్ 19, :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి ఆధ్వర్యంలో ఇంటి గ్రేటెడ్ మార్కెట్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గుంటుకు శ్రీనివాస్ రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్ల రసం అందించి, కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి శుభాకాంక్షలు తెలిపి, ఇందిరా పార్క్ వద్ద అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఉదారతను చాటిన నీలం మధు

- రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా పుట్టిన శిశువులకు రూ.20 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్
- ముత్తంగిలో సేవా కార్యక్రమాలతో ఘనంగా వేడుకలు



**పటాన్చేరు, జూన్ 19, :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ముత్తంగి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కేవలం కేక్ కటింగ్‌లకే పరిమితం కాకుండా సమాజంలోని నిరుపేదలు, కార్మికులు, పసికందులకు ఉపయోగపడేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ రోజు జన్మించిన ప్రతి శిశువు పేరుపై రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు నీలం మధు ప్రకటించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చే నిరుపేద కుటుంబాలకు ఇది భవిష్యత్తుకు భరోసా కల్పించే చిన్న సహాయమని పేర్కొన్నారు.అదేవిధంగా పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ సఫాయి కార్మికులను ఘనంగా సన్మానించి, వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నీలం మధు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రేమ, ఐక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేపట్టారని, ఆయన ఆశయాలు యువతకు ఆదర్శమని కొనియాడారు. పేదల పక్షాన నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా రాహుల్ గాంధీ నిలిచారని అన్నారు.రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు, కార్మికులకు సేవ చేయడం నిజమైన జన్మదిన కానుక అని పేర్కొన్నారు. పసికందుల భవిష్యత్తు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ అందించడం, జీహెచ్ఎంసీ కార్మికులను ఆదుకోవడం తమకు సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల పక్షాన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, నరసింహ రెడ్డి, వెంకటేష్ నాయక్, రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్ రెడ్డి, మణికంఠ, సందీప్ గౌడ్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోల్కూరి నరసింహారెడ్డి, అశోక్ ముదిరాజ్, మధు పంతులు, గడ్డ యాదయ్య, గుండ్ల మహేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, గోపాలకృష్ణ, సందీప్ యాదవ్, దశరథ్, ప్రవీణ్, విఠల్, రంజిత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ఆవిష్కరణ చేయడం అదృష్టం





- **పొలాసలో ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19, :** శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో సహస్ర లింగాల దేవాలయ ఆవరణలో జగిత్యాల మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మంత్రితో పాటు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు కరువు కాటకాలు రాకుండా చూడాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగభూషణం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిల్కురి శంకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, నాయకులు ముసుకు ఎల్లారెడ్డి, కొత్త మోహన్, బండ శంకర్, అడువల జ్యోతి లక్ష్మణ్, పురుషోత్తం రావు, టివి సూర్యం, మాజీ సర్పంచ్ చిర్ర నరేష్, దుమల రాజ్ కుమార్, ఖాజిం అలీ, ముకేష్ ఖన్నా, సురేష్, బీరబతిని శ్రీనివాస్, బోనగిరి నారాయణ, సాయి, విజయ్, దయల శరత్, చెట్టే భార్గవ్ నగేష్ శ్రీకాంత్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని మించి 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 19, :** సిద్దిపేట జిల్లాలో యాసంగి (రబీ) 2025–26 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తైందని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని అధిగమించి, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 427 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని 97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, ఇప్పటికే రూ.1,036 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన చెల్లింపులు కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆధ్వర్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో కొనుగోళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగాయని పేర్కొన్నారు. అదనపు హమాలీలు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు మిల్లర్లతో సమన్వయం చేస్తూ ధాన్యం తరలింపును వేగవంతం చేసినట్లు తెలిపారు.



కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా సౌకర్యాలు కల్పించామని, అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులు, గోదాములకు తరలించినట్లు తెలిపారు. అదనపు గోదాములను ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడా ధాన్యం నిల్వ సమస్య తలెత్తలేదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం కావడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# 21న మల్కారంలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

- **పాల్గొనున్న మంత్రి తుమ్మల, ఘనంగా సన్మానించనున్న పామాయిల్ రైతులు.**

**దమ్మపేట, జూన్ 19, :** దమ్మపేట మండల పరిధిలోని మల్కారం గ్రామంలో పార్టీలకు అతీతంగా మల్కారం గ్రామ ప్రజలు, పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనాన్ని జరపనున్నారు. జూన్ 21వ తేదీ, ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి పామాయిల్ లెజెండ్, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవు తున్నారు. పామాయిల్ పంట సాగు విస్తీర్ణం పెంచడంలో గాని, పామాయిల్ గెలల ధరను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని పామాయిల్ సాగులో నెంబర్ వన్ గా నిలిపే ఉద్దేశంగా



పనిచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని పామాయిల్ రైతులు ఘనంగా సన్మానించనున్నారు. ఇదే కార్యక్రమంలో తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ రంగ ప్రవేశం చేసి 45 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో దమ్మపేట మండల ప్రజలు మంత్రి తుమ్మలను సన్మానించనున్నారు. ఒక మారుమూల గిరిజన మండలమైన దమ్మపేట నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసి సుదీర్ఘకాలంగా ప్రజల మన్ననలు పొందడం సాధారణమైన విషయం కాదని, ఇది దమ్మపేట మండలానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జూన్ 21న మల్కారం గ్రామ ప్రజలతో పాటు, మండల ప్రజలు మంత్రి తుమ్మలకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మల్కారం గ్రామంలోని రైతులు, స్థానికులు పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**మిరుదొడ్డి, జూన్ 19, :** దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రీ–ప్రైమరీ, ఒకటవ తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కడారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఉచితంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మాట్ల పరశురాములు విద్యార్థులకు ఉచిత పలకలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అక్షరాభ్యాసం అనేది ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం అని, చిన్నారుల విద్యా ప్రయాణానికి ఇది తొలి అడుగు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రవీణ్, గ్రామ కార్యదర్శి యదగిర, ఉపాధ్యాయ బృందం, కృష్ణ, జాషువా, రాజేశ్వర్, చంద్రమౌళి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# అమీన్‌పూర్‌లో భూవివాదం.. హైడ్రా అధికారుల ఎదుటే ఇరు వర్గాల వాగ్వాదం

- **సర్వే పూర్తయ్యే వరకు నిర్మాణాలు చేపట్టొద్దని ఆదేశం**

**అమీన్‌పూర్, జూన్ 19, :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గుట్టకు వెళ్లే మార్గంలో భూ యాజమాన్య వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ భూమి, స్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఒక వర్గం ఆరోపించగా, అది ప్రభుత్వ భూమి కాదని, తమ ప్రైవేటు స్థలమని మరో వర్గం వాదించింది. ఈ వివాదం హైడ్రా అధికారుల సమక్షంలోనే వాగ్వాదానికి దారితీసింది.స్థానికుల ఫిర్యాదు మేరకు సర్వే నంబర్ 993లోని సుమారు 1,384 గజాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని సమాచారం అందడంతో హైడ్రా అధికారులు అక్కడికి చేరుకుని నిర్మాణ పనులను నిలిపివేశారు.ఈ సందర్భంగా దేవేందర్ యాదవ్‌తో పాటు మరికొందరు, తాము 1999లో సర్వే నంబర్లు 842, 844లోని ఎనిమిది ప్లాట్లను చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, తాము నిర్మిస్తున్న స్థలం ప్రభుత్వ భూమిలోకి రాదని అధికారులకు వివరించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.మరోవైపు, 2006లో ఇదే ప్రాంతంలో 1,384 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి గదులు నిర్మించిన ప్రకాష్ రెడ్డిపై 2024లో రెవెన్యూ అధికారులు ఆ స్థలం ప్రభుత్వ భూమిగా గుర్తించి కూల్చివేతలు చేపట్టడంతో పాటు కేసు కూడా నమోదు చేశారని స్థానికులు తెలిపారు. 2006లో కొనుగోలు చేసిన భూమి ప్రభుత్వ భూమి అయితే, 1999లో కొనుగోలు చేసిన భూమి ఎలా ప్రైవేటు అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.ఇరు వర్గాల వద్ద కూడా రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండటం గమనార్హం. అయితే, ఇద్దరి వద్ద ఉన్న డాక్యుమెంట్లు కూడా నకిలీవేనని 2006లో భూమి కొనుగోలు చేసిన ప్రకాష్ రెడ్డి



ఆరోపించారు.విషయంపై స్పందించిన హైడ్రా అధికారులు, పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి సంబంధిత స్థలం సర్వే నంబర్ 993లోని ప్రభుత్వ భూమిలోకి వస్తుందా, లేక సర్వే నంబర్లు 842, 844లోని ప్రైవేటు భూమిలో భాగమా అన్నది నిర్ధారిస్తామని తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సంబంధిత ప్లాట్ యజమానులను ఆదేశించారు.

# నాడు హరితహారంలో నాటారు..

## నేడు విద్యుత్ అంతరాయం పేరుతో నరికి వేస్తున్నారు

- **విద్యుత్ అంతరాయం సాకుతో సంవత్సరాల వృక్షాల ధ్వంసం**
- **లోపాయికారి ఒప్పందం ఉందని అనుమానిస్తున్న స్థానికులు**
- **చెట్లను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**





**మిరుదొడ్డి, జూన్ 19, :** ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి హరితహారంలో భాగంగా నాటిన, సంవత్సరాల నాటి పచ్చని వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు విచక్షణారహితంగా నరికివేశారు. విద్యుత్ వైర్లకు ఆటంకం అనే సాకుతో పెద్ద పెద్ద చెట్లను నరికి



అమ్ముకున్నారన్న ఆరోపణలు పలువురి నుండి వినిపిస్తున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం గత కొన్నేళ్లుగా పచ్చని వాతావరణంతో కళకళలాడిన ధర్మారం గ్రామం, ఇప్పుడు చెట్ల నరికివేతతో ఎడారిని తలపిస్తోంది. విద్యుత్ అంతరాయాలకు ఇబ్బందులు ఉన్నాయని చెబుతూ, వైర్లకు సంబంధం లేని భారీ వృక్షాలను సైతం నరికివేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇది కేవలం నిర్వహణ చర్య కాదు, కొంతమంది అధికారుల లోపాయికారి ఒప్పందంతోనే చెట్లను నరికి లాభార్జన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ నరికివేత జరిగిందా అంటూ చర్చ సాగుతోంది. సంవత్సరాలుగా మేము కాపాడుకున్న చెట్లను ఒక్కరోజులో నరికేసారు. ఇప్పుడు ఊరంతా నరికి వేసిన చెట్ల కొమ్మలు, దుంపలతో నిండిపోయిందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం హరితహారంలో లక్షలు ఖర్చుపెట్టి నాటిన మొక్కలు, ఏపుగా పెరిగిన తర్వాత నరికి వేయడంతో ప్రజాధనం వృథా అయిందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, అనుమతి లేకుండా చెట్లు నరికిన అధికారులపై, అక్రమంగా విక్రయించిన వారిపై అటవీ సంరక్షణ చట్టం కింద చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సరస్వతి గ్లోబల్ స్కూల్లో గాయత్రి పూజలు

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 19, :** సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సరస్వతి గ్లోబల్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన విద్య అకాడమీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గాయత్రి దేవి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి పూజ మహోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నారులు గాయత్రి దేవి పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గాయత్రి మంత్రాలు చదవడం శుభ పరిణామం అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు ప్రతి సంవత్సరం పాఠశాలలో గాయత్రి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్లోబల్ స్కూల్ చైర్మన్ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఉత్తమ విద్యా బోధనతో





విద్యార్థులకు మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం విద్యార్థులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, కనుక రెడ్డి, బాబా, ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు గయా ప్రసాద్

## నేడు గయాప్రసాద్ కటియార్ జయంతి

ఎందరో వీరుల త్యాగఫలం మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది విప్లవ వీరులు మరిచి పోలేని, వెల కట్టలేని త్యాగాలు చేశారు. ఆలాంటి వారిలో భారతీయ స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాలుపంచుకున్న భారతీయ విప్లవకారుడు గయా ప్రసాద్ ఎన్నదగిన వాడు. ఆయన గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవడం శోచనీ యం. గయాప్రసాద్ కటియార్ (20 జూన్ 1900 10 ఫిబ్రవరి 1993) "హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్"కు చెందిన విప్లవ వీరుడు. ఆయన 1900, జూన్ 20వ తేదీన నందరాణి, మౌగీరామ్ దంపతులకు కాన్పూర్ జిల్లా బిల్హౌర్ తాలూకా జగదీష్ పూర్ గ్రామంలో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్య తర్వాత ఇతడు కాన్పూర్లో మెడిసినల్ ప్రాక్టీస్ కోర్సులో చేరాడు. తర్వాత ఆర్య సమాజంలో చేరాడు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసి యేషన్ (హెచ్.ఆర్.ఎస్.ఎ)కు చెందిన ఇతర విప్లవ కారుల వలె ఆయన కూడా 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1926లో భగత్ సింగ్, రాజ్ గురులు హోళీ పండగ సందర్భంగా జగదీషాపూర్ వచ్చినప్పుడు వారితో ఆయనకు గట్టి అనుబంధం ఏర్పడింది. ఆయన విప్లవ పార్టీ బాంబులు తయారీ కారులకు చోటు కల్పించడం ముఖ్య మైన చర్యగా ఉ ండేది. ఆయన ఒక మారుపేరుతో వైద్య శాలను ప్రారంభించేవాడు. ఇతర విప్లవ కారులు ఆయన వైద్యశాలలో పనివారుగా నటించేవారు. ఆ వైద్యశాలలో రహస్యంగా బాంబులు తయారటయ్యేవి. ఆ సందర్భంగా రసాయనాల నుండి వచ్చే వాసనను మందులు తయారు చేయడంవల్ల వచ్చిందిగా చుట్టుపక్కల వారు భావించేవారు. డాక్టర్ బి.ఎస్.నిగం అనే మారు పేరుతో ఆయన ఫిరోజ్పుర్లోని తూరి బజార్లో 1928 ఆగస్ట్ 10 నుండి, 1929 ఫిబ్రవరి 9 వరకూ ఒక ఆసుపత్రి ముసుగులో బాంబుల కార్ఖానా నడిపాడు. దీనిలో శివ్ వర్మ అనే విప్లవకారుడు రామానారాయణ్ కపూర్ పేరుతో, మహావీర్ సింగ్ ప్రతాప్ సింగ్ పేరుతో, చంద్రశేఖర్ ఆజాద్ పండిత్ గీ పేరుతో, సుఖదేవ్ బలే జర్ పేరుతో, జయదేవ్ అనే విప్లవకారుడు గోపాల్ అనే మారు పేరుతో పనిచేసేవారు. పోలీసుల నిఘా చర్యలు అధికం కావడంతో తమ స్థావరాన్ని పరహస్పూరు మార్చారు. ఇన్ఫార్మర్ అయిన ఫిరోజ్పూర్ నివాసి కాలూరాం అనే మంగలి స్వంతపని మీద షరహన్పూర్ వచ్చి అక్కడ డాక్టర్ నిగమ్ టను చూసి, గయా ప్రసాద్ గుర్తించి స్థానిక పోలీసులకు ఈ విషయం తెలియ జేశాడు. 1929, మే 13న పోలీ సులు చౌబే పరి ష్ ప్రాంతంలోని వీరి స్థావరంపై దాడి చేసి శివ్ వర్మ, జయదేవ్ కపూర్లను అరెస్ట్ చేశారు. కాన్పూరుకు వెళ్ళిన గయాప్రసాద్ నిధులు సమకూర్చుకోలేక 1929 మే 15న షహ రన్ పూర్కు తిరిగి వచ్చాటడ. అయితే పోలీసులు చుట్టుముట్టి క్షణాలలో ఆయన చేతికి బేడీలు తగిలించారు. ఆయనను పోలీస్ స్టేషన్కు తరలించే సమయంలో గయాప్రసాద్ తన జేబులోని ఒక కాగితంలో కాకోరీ కుట్ర కేసులో నిందితులు తరఫున వాదించిన లక్నో న్యాయ వాదులు చంద్రభాను గుప్త, మోహన్లాల్ సక్సేనాల పేర్లు ఉండటాన్ని గుర్తు చేసుకుని ఆ కాగితాన్ని ఉండ చుట్టుకుని నోటిలో పెట్టుకుని మ్రింగడానికి ప్రయత్నించాడు. అది గొంతులో అడ్డం పడి విపరీతంగా దగ్గు వచ్చింది. నీరు కావాలని కానిస్టేబులు సంజ్ఞ చేసి నీటితో పాటు ఆ కాగితాన్ని మ్రింగివేశాడు. ఆయనను ఇతర హెచ్.ఆర్.ఎస్.ఎ విప్లవకారులతో కలిపి లాహోర్ తరలించారు. అక్కడ ఆయన నిరాహారదీక్ష చేపట్టాడు. లాహోర్ కుట్ర కేసులో విచారించి గీవిత ఖైదును విధించి అండమాన్ సెల్యులార్ జైలుకు తరలించారు. ఆ జైలులో ఖైదీల పట్ల చూపుతున్న అమానవీయ చర్యలకు నిరసనగా ఆయన అక్కడ కూడా 46 రోజుల పాటు నిరాహారదీక్ష చేశాడు.

ఆయన హెచ్.ఆర్.ఎస్.ఎ. సహచరుడు మహావీర్ సింగ్ ఈ సమ్మెలో మరణించాడు. దానితో ఆయనను ఆ జైలు నుండి తరలించారు. మళ్ళీ 1937లో ఆయనను సెల్యులార్ జైలుకు పంపారు. చివరకు 1946లో విడుదల చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా తన విప్లవ ధోరణితో రైతుల, కార్మికుల పక్షాన పోరాడాడు. ఫలితంగా 1958లో 6 నెలలపాటు, మళ్ళీ 1966-68లో ఒకటిన్నర సంవత్సరాలు జైలు గీవితం గడిపాడు.

**ఆయన 1993, ఫిబ్రవరి 10వ తేదీన మరణించాడు. ఆయన జ్ఞాపకార్థం 2016, డిసెంబర్ 26వ తేదీన భారత తపాలాశాఖ ఒక స్మారక తపాలాబిళ్ళను, ఫస్ట్ డే కవర్ను విడుదల చేసింది. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" అనే సినిమాలో ఆయన పాత్రను నీరజ్ షా పోషించాడు.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# శరణార్థులకు హక్కులు కల్పించాలి

## నేడు అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం




**ప్రతి సంవత్సరం జూన్ 20న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం, మానవాళికి సానుభూతి పాఠం నేర్పించే సందర్భం. యుద్ధాలు, మత, జాతి వివక్ష, రాజకీయ హింస, లేదా ప్రకృతి విపత్తుల కారణంగా తమ స్వస్థలాలను విడిచి, జీవన రక్షణ కోసం అన్యదేశాల్లో ఆశ్రయం పొందుతున్న కోట్లాది మంది శరణార్థుల బాధలను గుర్తించడానికి, వారి హక్కులను సమర్థించడానికి, ప్రపంచాన్ని కలుపుకొనే నిబద్ధతకు ఇది గుర్తింపు సూచిక.**



శరణార్థులు తమకు ఉన్న అన్నిటినీ కోల్పోయిన వారు – ఇల్లు, ఉపాధి, కుటుంబం, దేశం, గౌరవం. కానీ వారు కోల్పోని ముఖ్యమైన గుణం ధైర్యం. అదే ధైర్యం, స్థైర్యం ప్రపంచాన్ని నిశ్శబ్దంగా కదిలిస్తుంది. వారి గీవితాలకు మద్దతుగా నిలబడే ప్రయత్నం చేయడమే ఈ దినోత్సవం యొక్క అసలైన లక్ష్యం. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి 2000లో అధికారికంగా గుర్తించింది. 1951 శరణార్థుల ఒప్పందానికి 50 ఏళ్ళు పూర్తైన సందర్భంలో ప్రారంభమై, 2001 నుండి ప్రతి సంవత్సరం విశేషంగా నిర్వహించ బడుతోంది. ప్రతీ ఏడాది ఒక థీమ్ ఆధారంగా శరణార్థుల సమస్యలపై దృష్టి కేంద్రీకరిస్తూ, నూతన ఆలోచనలకు వేదికవుతోంది. 2025 సంవత్సరానికి ఎన్నికైన నినాదం – "ఎశీజూవ ాఘ్ఖుఎ ఖీతీశీఎ ఎశీఎవ:ా ఙశీతీశ్రీఎ ఙష్ట్రవతీవ తీవటబస్త్రవవం ఖతీవ ఖశ్రీఝుఎం అఅఙశ్రీబఎవఎ". ఈ నినాదం శరణార్థులు తాత్కాలిక బాధితులు కాదని, శాశ్వత సమాజ భాగస్వాములని, వారికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వివరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 12 కోట్లకు పైగా శరణార్థులు, అంతర్గత వలస దారులు, దేశ విహీనులు ఉన్నారని ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ (ఖచీనజ=) 2024 నివేదిక వెల్లడించింది. సిరియా, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, ఉక్రెయిన్, సూడాన్, సోమాలియా వంటి దేశాల్లో సంక్షోభాలు తీవ్రంగా ఉండటంతో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వారిలో చాలామంది పిల్లలు, మహిళలు, వృద్ధులు – ప్రాథమిక హక్కుల కంటే గీవిత హక్కు కోసం పోరాడుతున్న వారే. ఈ శరణార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు – సురక్షిత నివాసం లేకపోవడం, ఆహార, నీరు, వైద్య సేవల కొరత, విద్యా రాహిత్యం, ఉపాధి అవకాశాల లేమి, మానసిక ఒత్తిడి, మరియు కొన్ని సందర్భాల్లో నిర్దాక్షిణ్యమైన వివక్ష. వలసలో ప్రాణాలు కోల్పోయిన వారు వేలల్లో. సముద్రం దాటి బోట్లలో ప్రాణాలతో పయనించే వారు – మనిషి బతుకు విలువను ప్రశ్నించే నిదర్శనాలు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, శరణార్థులకు ఆశ్రయం, ఆహారం, ఆరోగ్యం, విద్య, తమ దేశానికి తిరిగి వెళ్లే స్వేచ్ఛ వంటి హక్కులు ఉన్నాయి. కానీ వాటి అమలులోని అసమానతలు, అనేక సందర్భాల్లో రాజ్యాల రాజకీయాలకు అనుగుణంగా మారుతుండటం గమనార్హం.

భారతదేశం 1951 ఒప్పందానికి అధికారికంగా సంతకం చేయక పోయినా, వాస్తవానికి శరణార్థుల పట్ల అత్యంత ఉదారంగా వ్యవహరించిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. టిబెటీయులు, శ్రీలంక తమిళులు, బంగ్లాదేశ్ వలస దారులు, ఆఫ్ఘన్ హిందూ – సిక్కు మైనారిటీలతో పాటు ఇటీవల రోహింగ్యాల వలసలతో భారతం మరోసారి మానవతా విలువలను చాటింది. పలు నగరాల్లో శరణార్థుల పునరావాస శిబిరాలు, పిల్లలకు విద్య, ఉపాధి శిక్షణలూ అందించడంలో దేశం ముందుండింది. ఈ దినాన్ని పురస్కరించుకొని వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజాసంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. శరణార్థుల కథలు ప్రదర్శనలు, డాక్యుమెంటరీలు, చర్చావేదికలు, విరాళ సేకరణలు, అవగాహన ర్యాలీలు -- ఇవన్నీ వారి బాధను ప్రపంచానికి తెలిసే ప్రయత్నమే. శరణార్థుల పట్ల మానవతా దృక్పథాన్ని సమాజంలో బలపరిచే విధంగా, ప్రతి ఒక్కరినీ చైతన్యవంతుల్ని చేసే విధంగా ఈ కార్యక్రమాలు సాగుతాయి. ఇలాంటి సందర్భంలో మనం చేయవలసినది...శరణార్థుల సమస్యలపై అవగాహన కల్పించటం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం, శరణార్థుల సంక్షేమానికి విరాళాలు అందించడం, వారిని మన సమాజంలో భాగంగా అంగీకరించటం. శరణార్థుల దినోత్సవం కేవలం గడిచి పోయిన బాధిత జ్ఞాపకానికి కాదు – అది నేడు ఉన్న బాధితులకు భవిష్యత్తును అందించేందుకు మనం చేసే ప్రయత్నానికి గుర్తింపు. ప్రతి శరణార్థి, మిగిలిన ప్రతి మనిషిలా, గౌరవంతో, హక్కుతో గీవించడానికి అనువైన పరిస్థితులు కల్పించ బడాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు సినీ గీత రచనకు ఆద్యులు చందాల కేశవదాసు

తెలుగు సినిమాలలో తొలి పాటను రాసింది ఎవరో తెలుసా? అలాంటి అవసరం, అవకాశం, సందర్భం రాలేదనుకుంటా. 1931లో తీసిన తొట్టతొలి తెలుగు టాకీ చిత్రం భక్త ప్రహ్లాదలో పరితాప భారంబు భరియింప తరమా అనే పాటను రాసింది బహుముఖ ప్రజ్ఞాశాలి చందాల కేశవదాసు. అంతేకాదు ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయకుంటే, ఆ మహనీయునికి తీరని అన్యాయం చేసిన వారం అవుతాం.

చందాల కేశవదాసు (జూన్ 20, 1876 – మే 14, 1956) తొలి తెలుగు నాటక కర్త, తొలి సినీ గీత రచయిత, కవి, నటులు, గాయకులు, హరికథా కళాకారులు, అష్టావధాని, శతావధాని. నాటకాల్లో మొదట పాడే పరబ్రహ్మ పరమేశ్వర అనే గొప్ప కీర్తనను, తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే భలే మంచి చౌక బేరము అనే పాటను రాసింది కూడా ఆయనే. కేశవదాసు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని జక్కేపల్లి లో 1876 జూన్ 20వ తేదీన చందాల లక్ష్మీనారాయణ, పాపమ్మ దంపతులకు రెండవ కుమారుడిగా జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో వీధిబడిలోనే కేశవదాసు విద్యనభ్యసించారు. ఛందస్సు, అవధానాధి ప్రక్రియలు నేర్చుకున్నారు. విద్యాభ్యాస అనంతరం తను చదువుకున్న వీధి బడి నడుపుతూ అవధానాది ప్రక్రియలలో నేర్పు సాధించారు. అష్టావధానాలు చేస్తూ దేశాటన చేస్తున్న కాలంలో సుప్రసిద్ధ వాగ్గేయకారుడు పాపట్ల కాంతయ్యతో స్నేహం ఏర్పడి, కాంతయ్య ద్వారా సంగీతంలోని మెలకువలు నేర్చుకున్నారు. గేయరచనలో, సంగీతం కూర్పులో, హరికథనంలో, రచనలో కేశవదాసు ఆరితేరారు. కాంతయ్యనాటక సమాజంలోచేరి కవిగా, నటుడిగా పేరుగాంచారు. ఈయన సేవకుడు వేషం నుంచి రాజు వేషం వరకు ఏ వేషమైనా వేసి మెప్పించగల సమర్థులు. మైలవరం కంపెనీకి శ్రీకృష్ణ తులాభారం, రాధా కృష్ణ నాటకాలకు పాటలు రాసిచ్చారు. అలా శ్రీకృష్ణ తులాభారం కోసం 'భలే మంచి చౌక బేరము సమయము మించినన్ దొరుకదు', నాటకాల్లో మొదట పాడే 'పరబ్రహ్మ పరమేశ్వర' అనే సుప్రసిద్ధ కీర్తన కేశవదాసు రాశారు. భక్త ప్రహ్లాద, కనకతార వంటి చిత్రాలకు కేశవదాసు మాటలు, పాటలు వ్రాశారు.



1930-33ల మధ్య కేశవదాసు వ్రాసిన జాతీయ గీతాలను సినీ గాయకుడు సాలూరు రాజేశ్వర రావు, అముల నరసింహా రావులు పాడగా బెంగుళూరులో రికార్డు చేశారు. ఈయన అనేక సినిమా స్క్రిప్టులతో పాటుగా, కేశవ శతకం, బలి బంధనం, సీతా కళ్యాణం, రుక్మాంగద, మేలు కొలుపులు, జోలపాటలు మొదలైన రచనలు చేశారు. బాల భారత్ సమాజం వారు ఆయన ఆధ్వర్యంలో అనేక నాటకాలను ప్రదర్శించేవారు. "కనక తార", "లంకా దహనం" వంటి నాటకాలను సినిమాలుగా కూడా తీసారు. నాటక రంగంలో చందాల కేశవదాసు మంచి పేరుతో ఒక వెలుగు వెలిగిపోతున్న సమయంలో సినిమా రంగం ఆహ్వానం పలికింది. అప్పటి దాకా భారతదేశ మంతటా మూగ సినిమాలు ఆడేవి. 1931 మార్చి 15న దేశంలో తొలిసారిగా 'ఆలం ఆరా' అనే మాటలతో కూడిన సినిమా వచ్చింది. ఇదే తొలి భారతీయ టాకీ. అదే యేడాది తెలుగులో కూడా టాకీ చిత్రం తీయాలనుకుని భక్త ప్రహ్లాద చిత్రం (1931-32)న ప్రారంభించారు. ఆ చిత్రంలో పాటలు రాయడానికి మన చందాల కేశవదాసును పిలవడంతో ఆయన సినీ గీవితం మొదలైంది. ఈచిత్రంలో ప్రహ్లాదునిగా కృష్ణాజిరావు షిండే, హిరణ్య కశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలాబాయి నటించారు. చిత్రంలో ఈమె పాడిన పరితాప భారంబు భరియింప తరమా పాటనే చందాల కేశవదాసు సినిమాకు రాసిన తొలిపాట. చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ కవిగా చరిత్ర కెక్కారు. తొలి చిత్రం భక్త ప్రహ్లాద (1931-32)కు రాసిన పాటలు, 1942లో తీసిన భక్త ప్రహ్లాదలోనూ వాడుకున్నారు. శ్రీకృష్ణ తులాభారం (1935)లో రాసిన పాటలు ఆ తరువాత 1956, 1966లోనూ అందుకే ఆయన తెలుగు సినిమా వాచస్పతిగా చరిత్రకెక్కారు. చందాల కేశవదాసు1936లో వచ్చిన 'లంకాదహనం' సినిమాకు కూడా మాటలు, పాటలు, పద్యాలూ రాశారు. కనకతారకు రాసిన కథ, పాటలు 1937, 1956లోనూ యధాతథంగా ఈ సినిమాల్లో వినియోగించు కున్నారు. మైలవరం కంపెనీ వారి బాలభారతి సమాజం పక్షాన నాటక ప్రదర్శనకోసం పలు ప్రాంతాలు తిరిగారు. తన కళా ప్రదర్శనల ద్వారా పొందిన బంగారు కంకణాలను, పతకాలను దాచుకోకుండా సత్కార్యాలకోసం ఖర్చుచేసి మార్గదర్శకంగా నిలిచాడు. హరికథా గానంతో వచ్చిన డబ్బుతో భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం బావి త్రవ్వించి, భోజన, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న కలపను సీతారామ చంద్రస్వామి రథగోపుర నిర్మాణానికి వాడారు. తమ్మరలో గాలిగోపురం, ధ్వజస్తంభం పనులు డబ్బులేక ఆగిపోతే ఇంటికి మనిషిని పంపించి బార్యచేతి బంగారు గాజులు తెప్పించి అమ్మారు. నల్గొండ జిల్లా హుజూర్నగర్ దగ్గర్లో వున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయాన్ని గీర్ణోద్ధరణ కావించారు. భద్రాచలం తిరువూరు మార్గం నుండి వేళ్లే భక్తులకు తిరువూరులో సత్రాలు ఏర్పాటు చేశారు. స్వంత ఖర్చుతో వీటిల్లో భక్తులకు ఉచిత అన్న దానం చేశారు. కోదాడ మండలం తమ్మరలో సీతారామచంద్రస్వామి ఆలయానికి గాలిగోపురం నిర్మించారు. రజాకార్లు జక్కేపల్లిలో కేశవదాసు ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఆ దాడిలో ఆయన ఆస్తిపాస్తులు, ధనమే గాక అంతకన్న విలువైన ఆయన సాహిత్య సంపద కూడా నాశనమైనది. కేశవదాసు 1956 మే 14న అంటే దుర్ముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం లో మ-రణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

**పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు**

**న్యూఢిల్లీ, జూన్ 19:** దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# ఐటీ షేర్లలో భారీ పతనం..

**రూ.1.35 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**ముంబై, జూన్ 19:** దేశీయ ఐటీ రంగం శుక్రవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ సాంకేతిక సేవల సంస్థ యాక్సెంచర్ విడుదల చేసిన తాజా ఆదాయ అంచనాల ప్రభావంతో భారత ఐటీ కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.1.35 లక్షల కోట్ల మేర నష్టం నమోదైనట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. కృత్రిమ మేధ ప్రభావంతో భవిష్యత్తులో సమాచార సాంకేతిక సేవల రంగంలో వృద్ధి మందగించే అవకాశం ఉందని యాక్సెంచర్ తన నివేదికలో సూచించింది. ఈ ప్రకటనతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొని, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. మార్కెట్ ట్రేడింగ్‌లో ప్రముఖ ఐటీ సంస్థల షేర్లు తీవ్రంగా పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 8.59 శాతం తగ్గగా, టెక్ మహీంద్రా షేర్లు 7 శాతం క్షీణించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం మేర పడిపోయాయి. భారత ఐటీ సంస్థలు అంతర్జాతీయ ప్రాజెక్టులు, సాంకేతిక సేవల విస్తరణలో విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో యాక్సెంచర్ అంచనాలు నేరుగా ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తుండటంతో సంప్రదాయ ఐటీ సేవల డిమాండ్‌పై అనిశ్చితి నెలకొన్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఐటీ రంగ భవిష్యత్తుపై జాగ్రత్త సంకేతాలు వెలువడటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ప్రారంభించారని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్ని రోజులుగా లాభాల బాటలో సాగిన దేశీయ మార్కెట్లు శుక్రవారం ఒక్కసారిగా ఒత్తిడికి లోనయ్యాయి. ఈ పరిణామాల ప్రభావంతో ప్రధాన సూచీలు కూడా బలహీనపడ్డాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అయితే దీర్ఘకాలికంగా భారత ఐటీ రంగ వృద్ధి అవకాశాలు ఇంకా బలంగానే ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితి తాత్కాలిక ప్రభావంగా మాత్రమే చూడాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.




# స్థిరంగా ఇంధన ధరలు

**వాహనదారులకు తాత్కాలిక ఊరట**




**హైదరాబాద్, జూన్ 19 :** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు విడుదల చేసిన తాజా ధరల జాబితా ప్రకారం జూన్ 19న కూడా ఇంధన ధరలు యథాతథంగా కొనసాగాయి. దీంతో వాహనదారులకు ధరల పెరుగుదల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కొంత మేర తగ్గినప్పటికీ, దేశీయంగా ఆ ప్రభావం ఇంకా కనిపించలేదు. గతంలో చమురు మార్కెటింగ్ సంస్థలకు వచ్చిన నష్టాలను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రస్తుతం ధరల తగ్గింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.73గా కొనసాగుతుండగా, డీజిల్ ధర రూ.103.82గా స్థిరంగా ఉంది. రాష్ట్రంలో అధిక పన్నుల కారణంగా ఇంధన ధరలు ఇంకా రూ.100కు పైగానే కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.78గా, డీజిల్ ధర రూ.104.52గా నమోదైంది. రాష్ట్ర పన్నుల ప్రభావంతో విజయవాడలో ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఉన్నాయి. విశాఖపట్నంలో పెట్రోల్ ధర రూ.116.39గా ఉండగా, డీజిల్ ధర రూ.104.34గా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఇతర నగరాలతో పోలిస్తే విశాఖలో ఇంధన ధరలు స్వల్పంగా తక్కువగా ఉండటం వాహనదారులకు కొంత ఉపశమనంగా మారింది. ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా మరింత తగ్గితే దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతానికి చమురు సంస్థలు ధరలను స్థిరంగానే కొనసాగిస్తున్నాయి.

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

**ఈ నెలలోనే వడ్డీ జమ**




**న్యూఢిల్లీ, జూన్ 19 :** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది పీఎఫ్ ఖాతాదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఎఫ్ వడ్డీ జమ ప్రక్రియను ఈ నెలలోనే పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో తమ ఖాతాల్లో వడ్డీ జమ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ మొత్తం నేరుగా జమ కానుండటంతో ఉద్యోగుల రిటైర్మెంట్ పొదుపు మరింత పెరగనుంది. వడ్డీ జమ అయిన తర్వాత ఖాతాదారులు తమ పాస్‌బుక్‌లో పెరిగిన బ్యాలెన్స్‌ను చూడవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత ఖాతాల్లో మొత్తం అప్డేట్ అవుతుంది. ఖాతాదారులు తమ పీఎఫ్ ఖాతాలో వడ్డీ జమ అయిందో లేదో ఆన్‌లైన్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. ఈపీఎఫ్ఓ అధికారిక పోర్టల్, ఉమాంగ్ యాప్ లేదా మిస్డ్ కాల్ సేవ ద్వారా ఖాతా వివరాలను పరిశీలించవచ్చు. యూఏఎన్ నంబర్ యాక్టివ్‌గా ఉండటం, మొబైల్ నంబర్ ఖాతాతో అనుసంధానం అయి ఉండటం అవసరం. ప్రభుత్వం నిర్ణయించిన వార్షిక వడ్డీ రేటు ప్రకారం ఈపీఎఫ్ఓ ఆటోమేటిక్‌గా వడ్డీని లెక్కించి ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందుకోసం ఖాతాదారులు ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి వడ్డీ జమలో స్వల్ప ఆలస్యం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అర్హులైన అందరికీ వడ్డీ అందుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పీఎఫ్ ఖాతాదారులు తమ ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఈపీఎఫ్ఓ నుంచి వచ్చే అధికారిక ప్రకటనలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెలాఖరులోగా వడ్డీ జమ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని తెలుస్తోంది.

# కొత్త రూపంలో పల్సర్ 220ఎఫ్

**న్యూఢిల్లీ, జూన్ 19 :** ద్విచక్ర వాహన ప్రియులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సరికొత్త మార్పులతో పల్సర్ 220ఎఫ్ మళ్లీ మార్కెట్లో సందడి చేస్తోంది. ఈసారి వాహనానికి మరింత శక్తివంతమైన కాంతిని అందించే ఆధునిక దీపాల వ్యవస్థను జోడించడం ద్వారా సంస్థ వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గత ఏడాది చివర్లో రంగులు, గ్రాఫిక్స్, సూచిక దీపాల్లో మార్పులు చేసిన తర్వాత ఇప్పుడు మరో కీలకమైన అప్‌డేట్‌ను అందించింది. ఇప్పటివరకు ఈ వాహనంలో ఉపయోగించిన సాధారణ హాలోజన్ దీపం స్థానంలో అధునాతన కాంతి సాంకేతికతతో కూడిన దీప వ్యవస్థను అమర్చారు. దీనికి పగటిపూట కూడా స్పష్టంగా కనిపించే ప్రత్యేక కాంతి పట్టీలను జత చేశారు. అయితే వాహనానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ముందు భాగ రూపకల్పన, అర్ధ కవరింగ్ ఆకృతి, శరీర నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో వాహనానికి ఉన్న సంప్రదాయ రూపం అలాగే కొనసాగుతూ ఆధునికతను సంతరించుకుంది. యాంత్రిక వ్యవస్థలో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో ఉన్న శక్తివంతమైన ఇంజిన్‌ను అలాగే కొనసాగించారు. 220 ఘన సెంటీమీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ఇంజిన్ మంచి పనితీరు అందిస్తూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతిని ఇస్తోంది. నగర రహదారుల నుంచి జాతీయ రహదారుల వరకు అన్ని పరిస్థితుల్లోనూ సమర్థవంతంగా పనిచేసే విధంగా దీనిని రూపొందించారు. ఐదు దశల గేర్ వ్యవస్థతో కూడిన ఈ వాహనం యువతలో ఇప్పటికీ మంచి ఆదరణ పొందుతోంది. కొత్త దీపాల వ్యవస్థ కారణంగా వాహనం ధరలో కూడా పెరుగుదల చోటుచేసుకుంది. గతంలో ఉన్న ధరతో పోలిస్తే సుమారు ఎనిమిది వేల రూపాయలు పెరిగింది. ప్రస్తుతం దేశ రాజధానిలో ఈ వాహనం ప్రాథమిక ధర లక్షా ముప్పై ఆరు వేల రూపాయలుగా నిర్ణయించారు. కొత్త సాంకేతిక సౌకర్యాలు జోడించినప్పటికీ ధరను అందుబాటులో ఉంచేందుకు సంస్థ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా మార్కెట్లో కొనసాగుతున్న ఈ వాహనానికి ఇప్పటికీ విశేషమైన ఆదరణ ఉంది. కొత్త తరహా నమూనాలు మార్కెట్లోకి వచ్చినప్పటికీ పల్సర్ 220ఎఫ్‌కు ఉన్న ప్రత్యేక అభిమాన వర్గం ఏమాత్రం తగ్గలేదు. దీర్ఘకాలిక నమ్మకం, బలమైన పనితీరు, ఆకర్షణీయమైన రూపకల్పన ఈ వాహనాన్ని ఇప్పటికీ ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. మరోవైపు



సంస్థ తమ ఇతర వాహన శ్రేణులను కూడా ఆధునికీకరించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కొత్త తరం చిన్న సామర్థ్య వాహనాలను రహదారులపై పరీక్షిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సౌకర్యాలతో కొత్త నమూనాలను వినియోగదారుల ముందుకు తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంతో ద్విచక్ర వాహన మార్కెట్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది.

# జియో భారీ ఐపీఓకు రంగం సిద్ధం

**మార్కెట్‌లోకి రానున్న టెలికాం దిగ్గజం**

**ముంబై, జూన్ 19 :** దేశంలోని అతిపెద్ద టెలికాం సంస్థలలో ఒకటైన జియో ఇన్ఫోకామ్ త్వరలో భారీ ఐపీఓతో స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ముకేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు ఇప్పటికే ఐపీఓ ముసాయిదా పత్రాలకు ఆమోదం తెలిపిందని, వాటిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఐపీఓ ద్వారా జియో సుమారు 4 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.36,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలో డిజిటల్ సేవలు, 5జీ విస్తరణ, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ రంగాల్లో జియో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి నెలకొంది. జియో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయితే భారత టెలికాం రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. మరోవైపు జియో ప్లాట్‌ఫామ్స్ విలువను మరింత పెంచేందుకు సంస్థ డిజిటల్ సేవలు, కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, 5జీ నెట్‌వర్క్ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ఆధిపత్యం సాధించేందుకు భారీ పెట్టుబడులు పెట్టాలని సంస్థ యోచిస్తోంది. జియో ఐపీఓ ప్రకటనతో దేశీయ పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. సెబీ అనుమతుల అనంతరం ఐపీఓ షెడ్యూల్, ధరల శ్రేణి, షేర్ కేటాయింపు వంటి పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్ వర్గాల దృష్టి మొత్తం జియో ఐపీఓపైనే కేంద్రీకృతమైంది.





## 2027 వన్డే ప్రపంచకప్‌లో ఇషాన్ ఖాయం: గవాస్కర్

అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 125 పరుగులతో చెలరేగిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇషాన్‌కు అప్పుడే దక్షిణాఫ్రికా వీసా దొరికినట్లు అనిపిస్తోందని, అతడిని జట్టు నుంచి తప్పించడం అసాధ్యమని గవాస్కర్ జోస్యం చెప్పారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ సైతం ఇషాన్ బ్యాటింగ్ శైలిని కొనియాడాడు. టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ .. ఇటీవల దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా తరఫున కమ్‌బ్యాక్ ఇచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. ప్రస్తుతం భారత జట్టులో కీలక ఆటగాడిగా మారిపోయాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో రెండో వన్డేలో మెరుపు శతకంతో సత్తాచాటాడు. దీంతో జట్టు నుంచి అతడిని తప్పించలేని పరిస్థితి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడారు. ఇషాన్ కిషన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027లో తప్పకుండా ఆడతాడని జోస్యం చెప్పారు. నాకు తెలిసి ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా (వన్డే ప్రపంచకప్ 2027 కోసం) వచ్చి ఉంటుందని అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో ఇషాన్ జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చక్కగా రాణిస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారిపోయాడు" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ కిషన్.. బ్యాటింగ్‌కు ఫిదా అయిపోయాడు. ఫార్మాట్, ఆడే పొజిషన్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అతడు టీమిండియా తరఫున ఆడుతున్నంత కాలం.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నది పట్టించుకోకుండా రన్స్ చేస్తాడని కొనియాడాడు. ముఖ్యంగా ఇషాన్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టే షాట్లు తనకు ఎంతో ఇష్టమని గ్రేమ్ స్వాన్ వ్యాఖ్యానించాడు. కాగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్.. 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. హాఫ్ సెంచరీ చేసేందుకు 52 బంతులు తీసుకున్న అతడు.. తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకుని ఔరా అనిపించాడు.



## హర్షిత్ రాణా రీ-ఎంట్రీ..!?

ఇండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాకు సంబంధించిన ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. అఫ్గానిస్తాన్‌తో శనివారం చెన్నైలో జరగబోయే లాస్ట్ వన్డే మ్యాచ్ కోసం అతన్ని ఇండియన్ క్రికెట్ టీమ్ స్క్వాడ్‌లోకి సెలెక్ట్ చేశారు. త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్‌లో ఫస్ట్ రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇండియా ఆల్రెడీ 2-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు క్లీన్‌స్వీప్ టార్గెట్‌గా పెట్టుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆర్మీకి హర్షిత్ రాణా రాక మరింత బలాన్ని ఇచ్చింది. టీ20 వరల్డ్ కప్ 2026 కు ముందు ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ టైమ్‌లో హర్షిత్ మోకాలి గాయానికి గురయ్యాడు. దీంతో ఆ మెగా టోర్నమెంట్‌తో పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ కు కూడా కంప్లీట్‌గా దూరమయ్యాడు. గాయం తర్వాత హర్షిత్ రాణా చాలా రోజులు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో చేరిన హర్షిత్, అక్కడ తన రిహాబిలిటేషన్‌ను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాత చెన్నై వేదికగా అఫ్గానిస్తాన్‌తో జరిగే మ్యాచ్ కోసం టీమ్‌తో జాయిన్ అయ్యాడు. "బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్న హర్షిత్ రాణా చెన్నైలో వన్డే స్క్వాడ్‌తో కలిశాడు" అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఒక మీడియా రిలీజ్ లో స్పష్టం చేశారు. 2గీ ఏళ్ల హర్షిత్ రాణా ఇండియా తరఫున ఇప్పటివరకు 1గీ వన్డేలు ఆడి 27.38 యావరేజ్, 6.21 ఎకానమీ రేట్‌తో 16 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన హోమ్ టీ20ఐ సిరీస్‌లో అతను లాస్ట్ టైమ్ ఇండియా జెర్సీలో కనిపించాడు. అయితే గాయం నుంచి కోలుకున్న వెంటనే అతనికి సెలెక్టర్లు వరుస ఛాన్సులు ఇస్తున్నారు. అఫ్గాన్ మ్యాచ్‌తో పాటు రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లలో ఆడే ఇండియా స్క్వాడ్‌లో కూడా హర్షిత్‌కు ప్లేస్ దక్కింది. ఈ రెండు టూర్లలో ఇండియా మొత్తం ఏడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న హర్షిత్ రాణా చేపాక్ పిచ్‌పై ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తాడనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. సిరీస్ ఆల్రెడీ ఇండియా సొంతం అవ్వడంతో లాస్ట్ వన్డేలో బెంచ్ ప్లేయర్లకు ఛాన్స్ ఇచ్చే యోచనలో మేనేజ్మెంట్ ఉంది. చెన్నై మ్యాచ్ కోసం బీసీసీఐ అనౌన్స్ చేసిన అప్‌డేటెడ్ స్క్వాడ్ చూస్తే.. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, యశస్వి జైస్వాల్, హర్షిత్ రాణా ఉన్నారు. స్పిన్‌కు సపోర్ట్ చేసే చెన్నై పిచ్‌పై అఫ్గాన్‌ను క్లీన్‌స్వీప్ చేసి సిరీస్‌ను పర్ఫెక్ట్‌గా ముగించాలని టీమిండియా ప్లాన్ చేస్తోంది.

# టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!




భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు. దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు. 2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

# డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ



మేజర్ లీగ్ 2026లో ఫాఫ్ డుప్లెసిస్ తొలి మ్యాచ్‌లోనే విధ్వంసం సృష్టించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ తరఫున ఆడిన డూప్లెసిస్ గీ6 బంతుల్లోనే సెంచరీ చేశాడు. గీ1 ఏళ్లలో గీ6 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మేజర్ లీగ్‌లో ఫాఫ్ గీ సెంచరీలతో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో సియాటెల్ ఓపెనర్ టిమ్ సైఫర్ట్ కూడా సెంచరీ చేయడం విశేషం.

ఈ మ్యాచ్‌లో టెక్సాస్ ఘన విజయం సాధించింది. ఫాఫ్ డుప్లెసిస్ వావ్ అనిపించే ప్రదర్శన చేశాడు. గీ1 ఏళ్ల వయస్సులో కేవలం గీ6 బంతుల్లోనే సెంచరీ బాది తనలో ఇంకా సత్తా ఉంది అనిపించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్ బై చెప్పిన డుప్లెసిస్.. టీ20 లీగ్‌లలో మాత్రం కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చివరిసారిగా ఆడిన ఈ లెజెండ్.. ఐపీఎల్ 2026కు ముందు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా యూఎస్ఏ వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ టీ20లో చెన్నై సూపర్ కింగ్స్‌కి టెక్సాస్ సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. టెక్సాస్‌కి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ మేజర్ లీగ్ 2026 తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాది జట్టుకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని నాటౌట్‌గా నిలిచి ఛేదించాడు. మేజర్ లీగ్‌లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఫాఫ్, ఈ లీగ్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సియాటెల్ ఆర్కాస్ టెక్సాస్ బౌలర్లను ఉతికారేసింది. న్యూజిలాండ్ స్టార్ హిట్టర్ టిమ్ సైఫర్ట్ బౌండరీల మోత మోగించాడు. 66 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఆరు సిక్సర్లతో 10గీ పరుగులు చేయగా.. షయాన్ జహంగీర్ గీ7 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు బాదాడు. ఆఖర్లో కెప్టెన్ మార్కస్ స్టొయినీస్ 3 బంతుల్లో 13 పరుగులు చేయడంతో సియాటెల్ 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రెండో బంతికే వికెట్ కోల్పోయింది. తెలుగు ఆటగాడు సాయితేజ ముక్కమల్ల తాను ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్ అయ్యాడు. తొలి ఓవర్‌లోనే వికెట్ పడినప్పటికీ ఫాఫ్ డుప్లెసిస్ సియాటెల్ బౌలర్లకు చుక్కలు చూయించాడు. రీలీ రోసోస్‌తో కలిసి పవర్ ప్లేలోనే 89 పరుగులు రాబట్టాడు. 21 బంతుల్లో 7 ఫోర్లు, రెండు సిక్సర్లతో రోసోస్ గీ9 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే మిలింద్ కుమార్, శుభమ్ రంజనే కూడా అవుటవ్వడంతో 165కే నాలుగు వికెట్లు కోల్పోయింది. వియాన్ ముల్డర్‌తో కలిసి ఫాఫ్ డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. గీ6 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్ 52 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ముల్డర్ కూడా 15 బంతుల్లో మూడు సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. దాంతో టెక్సాస్ 18.3 ఓవర్లలోనే 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

# కెనడా- ఖతార్ మ్యాచ్‌లో తీవ్ర ఉద్రిక్తత!

## మ్యాచ్‌లో ఆటగాళ్ల మధ్య ఘర్షణ

ఫిఫా వరల్డ్?కప్? 2026లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖతార్??తో జరిగిన మ్యాచ్?లో కెనడా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్?లో కెనడా 6-0 తేడాతో ఖతార్?ను చిత్తు చేసింది. అయితే మ్యాచ్ అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుజట్ల ఆటగాళ్లు గ్రౌండ్?లోనే గొడవకు దిగడంతో అక్కడి ప్రాంతం ఒక్కసారిగా హీటెక్కింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ ప్రపంచకప్?లో వాంకోవర్ బీసీ ప్లేస్ స్టేడియం వేదికగా తాజాగా కెనడా- ఖతార్ జట్లు తలపడ్డాయి. అయితే మ్యాచ్ ముగిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలోనే ఘర్షణకు దిగారు. మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ మార్ష్- ఖతార్ మేనేజర్ జూలెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జూలెన్?తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించినట్లు కనిపించింది. ఇది ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. ఆ తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు, సిబ్బంది మైదానంలోనే ఒకరినొకరితో కలపడ్డారు. పరస్పరం నెట్టేసుకున్నారు. వెంటనే భద్రతా సిబ్బంది మైదానంలోకి చేరుకుని ఇరు జట్ల ఆటగాళ్లను విడగొట్టారు. దీంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే మ్యాచ్? సమయంలోనే ఈ వివాదం మొదలైంది. ఖతార్ ఆటగాడు అసిమ్ మడిబో, కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్‌ను ఆట మధ్యలో గాయపర్చాడు. దీంతో కెనడా జట్టు తీవ్ర ఆగ్రహానికి గురైంది. సెకండ్ హాఫ్? ప్రారంభమైన కొద్ది సేపటికే, అసిమ్ మడిబో చేసిన ప్రమాదకరమైన టాకిల్ వల్ల ఇస్మాయిల్ కోన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నొప్పితో విలవిల్లాడాడు. దీంతో అతడిని స్ట్రెచర్‌పై మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇస్మాయిల్ కోన్?కు గాయపర్చడం కెనడా తోటి ఆటగాళ్లను కలచివేసింది. ఈ ఆగ్రహమే ఘ-ర్షణకు దారితీసింది. ఇక దీనికి కారణమైన అసిమ్






మడిబోకు రిఫరీ రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి బయటకు పంపించేశాడు. అసిమ్ మడిబోకు రెడ్ కార్డ్ రావడంతో ఖతార్ 10 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న కెనడా విజృంభించింది. ఇస్మాయిల్ కోన్ గాయపడడంతో కెనడా జట్టులోకి జాకబ్ షాఫెల్‌బర్గ్ వచ్చాడు. అతడు గోల్ చేసిన అనంతరం ఇస్మాయిల్ జెర్సీని గాలిలో ఊపుతూ సంబరాలు చేసుకున్నాడు. అలాగే కెనడా తరఫున జొనాథన్ డేవిడ్ అద్భుతంగా రాణించాడు. మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ సాధించాడు. ఇక ఫీఫా ప్రపంచ కప్ చరిత్రలో కెనడాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో కెనడా ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉంది. గ్రూప్ బీ లో టాప్? ప్లేస్?కు దూసుకెళ్లింది.



# బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

## ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

# తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొొతుండు' వంటి విలక్షణమైన జానపద రీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.



# ధనుష్ తాజా చిత్రం ఓం






తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమ-రన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణ సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com